మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD | తెలుగు దిన పత్రిక | RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | ఆదివారం | 14-12-2025 | సంపుటి : 14 | సంచిక :188 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Sunday | 14-12-2025 | Volume :14 | Issue:188 | Pages:8 | Cost : 3 |


విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066


# గోల్ కొట్టిన సీఎం



హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే హైదరాబాద్) :ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఫ్రెండ్లీ ఫుట్ బాల్ మ్యాచ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సింగరేణి ఆర్‌ఆర్ జట్టు విజయం సాధించింది. సింగరేణి ఆర్‌ఆర్ జట్టు తరుపున సీఎం రేవంత్ రెడ్డి.. అపర్ణ మెస్సీ ఆల్ స్టార్స్ నుంచి ఫుట్‌బాల్ దిగ్గజం లియోనాల్ మెస్సీ గ్రౌండ్‌లోకి దిగడం అభిమానులను ఉర్రూతలూగించింది. శనివారం రాత్రి 8 గంటలకు ప్రారంభమైన ఈ ఫుట్ బాల్ మ్యాచ్‌లో.. ప్రారంభంలోనే సింగరేణి ఆర్‌ఆర్ జట్టు వరుసగా రెండు గోల్స్ సాధించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా గ్రౌండ్లోకి దిగడమే కాకుండా.. ఒక గోల్ సాధించి మ్యాచ్ చూడటానికి వచ్చిన వారికి మజాను పంచారు. మ్యాచ్ 18వ నిమిషంలో గ్రౌండ్?లో అడుగుపెట్టిన రేవంత్ రెడ్డి వచ్చీ రావటంతోనే గోల్ కొట్టి అలరించారు. దీంతో అభిమానుల కేరింతలతో ఉప్పల్ స్టేడియం మార్మోగింది.

ఆ తర్వాత లియోనాల్ మెస్సీ కూడా గ్రౌండ్లోకి దిగి సీఎం రేవంత్ రెడ్డితో కలిసి సరదాగా కాసేపు ఫుట్ బాల్ ఆడారు. మ్యాచ్ పూర్తైన తర్వాత సింగరేణి ఆర్‌ఆర్ జట్టుకు మెస్సీ ట్రోఫీని అందజేశారు. అలాగే అపర్ణ మెస్సీ ఆల్ స్టార్స్ జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్రోఫీని అందించారు. మ్యాచ్ సందర్భంగా మెస్సీ, రోడ్రిగో, సీఎం రేవంత్ రెడ్డి స్టేడియంలో చుట్టూ తిరుగుతూ ప్రేక్షకులకు అభివాదం చేశారు. మరోవైపు తమ అభిమాన క్రీడాకారుణ్ని చూసేందుకు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మ్యాచ్ సందర్భంగా తెలంగాణ గురుకుల పాఠశాలల విద్యార్థులతో మెస్సీ ముచ్చటించారు. గురుకుల పాఠశాలల నుంచి వచ్చిన నాలుగు జూనియర్ టీమ్స్‌తో మాట్లాడిన మెస్సీ, వారికి ఫుట్‌బాల్ మెళకువలు అందించారు. మరోవైపు ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు.లియోనాల్ మెస్సీ హైదరాబాద్? వచ్చారు. కలకత్తా నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మెస్సీ.. అక్కడి నుంచి ఫలక్ నుమా ప్యాలెస్? చేరుకున్నారు. ఫలక్ నుమా ప్యాలెస్?లో లియోనాల్ మెస్సీకి సీఎం రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఆ తర్వాత ఫలక్ నుమా ప్యాలెస్?లో నిర్వహించిన మీట్-అండ్-గ్రీట్ కార్యక్రమంలో లియోనాల్ మెస్సీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అక్కడి నుంచి ఉప్పల్ స్టేడియానికి చేరుకుని మ్యాచ్‌లో పాల్గొన్నారు.




## మూడు నెలల్లోనే నవ వధువు ఆత్మహత్య



డిసెంబర్ 13 (నమస్తే హైదరాబాద్) : వారిద్దరూ ఎన్నో ఆశలతో వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. కొత్త జీవితం గురించి కోటి కలలు కన్నారు. కానీ పెళ్లి తర్వాత వారి ఆశలు, కలలు కల్లలయ్యాయి. అభిప్రాయభేదాలో లేక మరే ఇతర కారణమో తెలియదు కానీ.. పెళ్లైన నాటి నుంచి భార్యాభర్తలిద్దరి మధ్య తరచుగా గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఎంతో సంతోషంగా సాగుతుందనుకున్న వైవాహిక జీవితం.. నిత్యం గొడవలతో నరకంగా మారడంతో.. తీవ్ర మనస్తాపానికి గురైన నవ వధువు దారుణానికి ఒడిగట్టింది.పెళ్లైన మూడు నెలలకే ఓ నవ వధువు ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన హైదరాబాద్, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసాపేట్‌లో వెలుగు చూసింది. పెళ్లైన నాటి నుంచి నిత్యం గొడవలు జరుగుతుండటంతో.. ఇలాంటి దారుణ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..

2లో

## ఈటల రాజేందర్ షాకింగ్ కామెంట్స్



హనుమకొండ, డిసెంబర్ 13 (నమస్తే హైదరాబాద్) : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పీఆర్వో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను బీజేపీ ఎంపీనని... తాను కూడా కొన్ని పోస్టులను చూశానని ప్రస్తావించారు. అవగాహన లేకుండా కొంతమంది తనపై కుట్ర పూరితంగా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. ఇవాళ(శనివారం) కమలాపూర్‌లో ఈటల రాజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు ఈటల రాజేందర్.

అలా పోస్టులు పెడతారా..?..

వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. అవగాహన ఉన్నవారు అలా పోస్టులు పెడతారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తాను ఏ పార్టీలో ఉండాలో ప్రజలు తేల్చుకుంటారని చెప్పుకొచ్చారు. ఈ అంశాలను బీజేపీ హై కమాండ్ తేలుస్తుందని.. సమయమే ఇది డిసైడ్ చేస్తుందని వ్యాఖ్యానించారు. తనపై ఎవరు ఏమి చేస్తున్నారు.. ఎవరేం చెబుతున్నారో ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు. సందర్భం వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతానని అన్నారు. రెండు, మూడో విడత పంచాయతీ ఎన్నికలు పూర్తి అయ్యాక ఇటీవల జరిగిన పరిణామాలన్నీ తాను చెబుతానని పేర్కొన్నారు ఈటల రాజేందర్.

పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లని కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌పై ఎంత వ్యతిరేకత ఉందో ఈ ఫలితాలను బట్టి అర్థం చేసుకోవాలని చెప్పుకొచ్చారు. సింగరేణిలో క్వార్టర్స్ బాగుచేయడానికి పైసలు లేవా అని ప్రశ్నించారు. సింగరేణి డబ్బులతో తన ఫుట్‌బాల్ ట్రైనింగ్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి వందల కోట్లు ఖర్చు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు కోట్ల రూపాయలు దోపిడి చేశారని కవిత ఆరోపిస్తున్నారని అన్నారు ఈటల

2లో

## సర్పంచ్ ఎన్నికల బరిలో ఎంబీబీఎస్ విద్యార్థిని

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే హైదరాబాద్) : తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల హవా కొనసాగుతోంది. రాష్ట్రంలో రెండో విడత ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో.. రాజకీయాలపై యువత ఆసక్తి చూపుతూ ఎన్నికల బరిలోకి దిగుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలో ఎంబీబీఎస్ విద్యార్థిని సర్పంచ్ పదవికి పోటీ చేయడం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. వికారాబాద్ జిల్లా, దోమ మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి గ్రామంలో ఈ నెల 17న జరగనున్న సర్పంచ్ ఎన్నికల బరిలో ఎంబీబీఎస్ విద్యార్థిని శ్రీయ రెడ్డి పోటీ పడుతున్నారు.

సమాజ సేవ సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో పోటీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామంలోని యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనేది తన ప్రధాన లక్ష్యమని శ్రీయ స్పష్టం చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు.. కార్పొరేట్ ఆసుపత్రులలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తమ కుటుంబీకులు పదవులతో సంబంధం



లేకుండా ఎల్లప్పుడూ పేద ప్రజల కోసం సేవ చేస్తూనే ఉన్నారని.. నిరుపేదలకు సహాయం చేయడానికి ముందుంటామని ఆమె పేర్కొన్నారు. రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సన్నాహాలు.. తెలంగాణలో ఆదివారం (రేపు) రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. దీని కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 4,332 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే.. 415 గ్రామాల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. మరో 5 చోట్ల నామినేషన్లు లేకపోవడంతో అక్కడ ఎన్నికలు జరగడం లేదు. ఏకగ్రీవాలు కాకుండా.. మిగిలిన 3,911 పంచాయతీలకు సర్పంచులు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. అధికారులు ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

రెండో దశ పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి పట్టణాలలో నివసిస్తున్న ప్రజలు తమ స్వగ్రామాలకు పెద్ద ఎత్తున బయలుదేరారు. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ లు ఏర్పడ్డాయి. ప్రజలు ఉత్సాహంగా తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడానికి సిద్ధమయ్యారు. శ్రీయ రెడ్డి వంటి చదువుకున్న యువత.. కేవలం వృత్తిని మాత్రమే కాకుండా, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం స్థానిక పాలనలో సానుకూల మార్పులకు దారి తీస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు కూడా అభ్యర్థి విద్యార్హతలు, సేవా దృక్పథానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

## మా డబ్బులు ఇచ్చేయండి.. ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి కన్నీరు




నల్లగొండ, డిసెంబర్ 13 (నమస్తే హైదరాబాద్) : తెలంగాణలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల కోసం బరిలోకి దిగిన అభ్యర్థులు ఎంతో ఖర్చు పెట్టారు. తమను గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ఓటర్లను కోరారు. అంతేకాకుండా ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు భారీగా డబ్బులు ఖర్చుపెట్టారు. అయితే ఈనెల 11న మొదటి విడత ఎన్నికలు జరుగగా.. అదే

2లో

## తెలంగాణలో నేడు మలిదశ పంచాయతీ పోరు..

# ఏర్పాట్లు కట్టుదిట్టం..

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే హైదరాబాద్) : తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా పంచాయతీ ఎన్నికల గురించే మాట్లాడుకుంటున్నారు. గెలుపు కోసం పార్టీ అభ్యర్థులు తమ ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నారు. రేపు(ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా 3,911 గ్రామాల్లో రెండోదశ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. 13,128 సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉండగా.. 29,903 వార్డులకు 78,158 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. రేపు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ జరిగి ఫలితాలు రానున్నాయి.ఎన్నికల నిర్వహణ కోసం శనివారం సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. తొలిదశ పోరులో కాంగ్రెస్ బలపర్చిన




అభ్యర్థులు మెజార్టీ స్థాయిలో గెలిచారు. ఆ తర్వాత స్థానంలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచారు. రెండో విడత ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఉన్న అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా చేసుకొని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇంటింటికి తీరిగి నగదు, మద్యం, మాంసాహారం ఇస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే

2లో

## కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని వ్యాఖ్య



హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే హైదరాబాద్) : కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎన్నికలకు తెలంగాణ ప్రజలు ఓటుతోనే గుణపాఠం చెప్పారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్

2లో

## ఉప్పల్ స్టేడియం వద్ద పోలీసుల భారీ బందోబస్తు

ఉప్పల్ స్టేడియంలో మెస్సి మ్యాచ్ కోసం అభిమానులు భారీగా తరలివస్తుండటంతో రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 3000

2లో

## మూడు నెలల్లోనే నవ వధువు ఆత్మహత్య

ఆంధ్రప్రదేశ్, ప్రొద్దుటూరుకు చెందిన చందన జ్యోతి అనే యువతికి.. మూడు నెలల క్రితం వివాహం అయ్యింది. కొత్తగూడెంకు చెందిన యశ్వంత్‌తో ఆమె వివాహం జరిగింది. యశ్వంత్.. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లయిన తర్వాత వీరిద్దరూ సిటీలోని.. మూసాపేట్‌లో నివసిస్తున్నారు. ఎంతో అన్యోన్యంగా, సంతోషంగా జీవించాల్సిన ఈ నూతన జంట.. నిత్యం గొడవలు పడుతుండేవారు. ఈ క్రమంలో తాజాగా శుక్రవారం కూడా వీరి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చందన జ్యోతి.. బెడ్‌రూమ్‌లోకి వెళ్లి.. తలుపులు వేసుకుని.. ఆత్మహత్యకు పాల్పడింది.

గదిలోకి వెళ్లిన చందన జ్యోతి ఎంత సేపటికీ తలుపు తీయకపోవడంతో.. అనుమానం వచ్చిన యశ్వంత్.. తలుపులు బద్దలు కొట్టి చూడగా... అపస్మారక స్థితిలో కనిపించింది. అది గమనించిన యశ్వంత్ వెంటనే 108కు కాల్ చేశాడు. అంబులెన్స్ రాగానే చందనను దానిలో ఎక్కించి స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చందనను పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మరణించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. చందన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఎన్నో ఆశలతో కుమార్తెకి పెళ్లి చేశాము.. తను పండంటి బిడ్డలను కని.. భర్తతో కలిసి సంతోషంగా ఉంటుందని భావిస్తే.. ఇలా అర్థాంతరంగా చనిపోయి తమకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందంటూ చందన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## ఈటల రాజేందర్ షాకింగ్ కామెంట్స్

రాజేందర్.

కాంగ్రెస్ సర్కార్ పేదల ఇళ్లను కూలుస్తుందా..?

ఆరోపణలు వస్తున్న బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ సర్కార్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. జీతాలు ఇవ్వడానికి కూడా డబ్బులు లేవని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వల్లకాడులా మారే పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం పేదల ఇళ్లను కూలుస్తుందా?.. పెద్దల ఆస్తులను కాపాడుతుందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గ్రామాల అభివృద్ధిలో తన వంతు సహకారం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. తన స్వగ్రామం కమలాపూర్‌లో తనను తొక్కేయాలని చూశారని ఆరోపించారు. కొంతమంది తన గురించి మాట్లాడారని.. వాళ్లను ప్రజలు తొక్కేశారని విమర్శించారు. నిస్వార్థంతో పనిచేసే తమ అభ్యర్థులను గెలిపించినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు ఈటల రాజేందర్.

## ఉప్పల్ స్టేడియం వద్ద పోలీసుల భారీ బందోబస్తు

మంది పోలీసు సిబ్బంది, 450 సీసీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో గస్తీ నిర్వహిస్తున్నారు. కేవలం పాసులు ఉన్నవారిని మాత్రమే స్టేడియంలోకి అనుమతిస్తున్నారు. స్టేడియం పరిసరాల్లో గుమిగూడొద్దని పోలీసులు హెచ్చరించారు.

## తెలంగాణలో నేడు మలిదశ పంచాయతీ పోరు.. ఏర్పాట్లు కట్టుదిట్టం..

ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. డబ్బు అయితే ఫోన్ పే లాంటి మాధ్యమాల ద్వారా నగదు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు కుల సంఘాల వారీగా తాయిలాలు, హామీలు ఇస్తు మచ్చిక చేసుకుంటూ అభ్యర్థులు రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నట్లుగా సమాచారం.

ముఖ్యంగా శంషాబాద్, షాద్ నగర్, కేశంపేట ప్రాంతాల్లో ఓటుకు 5 వేల నుంచి 10 వేల వరకు పంచినట్లు సమాచారం. పోలింగ్ రోజు మద్యం దుకాణాలు బంద్ ఉ ంటాయి. ఇక రెండో విడత ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు ఉంటుందని ఆయా జిల్లాల కలెక్టర్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే..తొలిదశ పోరు కొన్ని చెదురుమదురు సంఘటలను మినహా ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.


## చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

### బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

**ఉప్పల్, డిసెంబర్ 13 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి తో కలిసి చిల్కానగర్ డివిజన్ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కలిసి చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది.

చిల్కానగర్ డివిజన్లోని శివాలయం వెనకాల ఇమామ్ గల్లీలో స్ట్రాం వాటర్ డ్రైన్స్, సిసి రోడ్ల కొరకు, మరల మైసమ్మ ఆలయం పక్క వీధిలో సుభద్ర, సత్యవతి గల్లీలో సిసి రోడ్ల మరియు నాగదేవత ఎదురుగా ఉన్న ప్రాంతంలో సిసి రోడ్లకు కొరకు, ప్రశాంత్ నగర్ రోడ్ నెంబర్ 1, 2 , లో సిసి రోడ్లకు, కళ్యాణపురి మర్రిచెట్టు దగ్గర నుండి కళ్యాణపురి పార్క్ వరకు సిసి రోడ్డు కొరకు,

బీరప్ప గడ్డ రామాలయం ప్రాంతంలో లైబ్రరీ ఎదురు గల్లీలో అదేవిధంగా లైబ్రరీ వెనకాల అన్నపూర్ణ కాలనీలో సిసి రోడ్లు కొరకు నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది. అదేవిధంగా డివిజన్లోని పలు కాలనీలో కమ్యూనిటీ హాల్ ల నిర్మాణం కొరకు అజ్మత్ నగర్ కాలనీ, బీరప్ప గడ్డ లైబ్రరీ వెనకాల, అంబేద్కర్ నగర్ బస్తీ, ఇందిరానగర్ బస్తీ, చిల్కానగర్ గుట్టపైన నవోదయ కాలనీ, మల్లికార్జున్ నగర్ లో కమ్యూనిటీ హాల్లో కొరకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు.జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సానుకూలంగా స్పందిస్తూ వివరించిన అభివృద్ధి పనులకు వీలైనంత త్వరలో నిధులు కేటాయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.



## కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని వ్యాఖ్య

రావు అన్నారు. మెదక్ జిల్లాలోని పాపన్నపేట, ఘనపూర్ మండలాల్లో బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన 26 మంది నూతన సర్పంచులు ఈరోజు హరీశ్ రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. హరీశ్ రావు వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డబ్బు సంచులతో ప్రలోభపెట్టాలని చూసినా, బెదిరింపులకు పాల్పడినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారని అన్నారు. నామినేషన్ల దశ నుంచే బీఆర్ఎస్ మద్దతుదారు అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. ఏకగ్రీవాల పేరుతో బెదిరించినప్పటికీ తమ కార్యకర్తలు, నాయకులు గులాబీ జెండాను వదలలేదని, ఈ గెలుపు బీఆర్ఎస్ కార్యకర్తల మనోధైర్యానికి నిదర్శనమని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని అన్నారు. పైగా కేసీఆర్ ఇస్తున్న పథకాలకు కోతలు పెట్టారని, ఈ మోసాన్ని ప్రజలందరూ గమనించారని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పారని అన్నారు. ముఖ్యంగా గిరిజన తండాల్లో మన అభ్యర్థులు, గిరిజన బిడ్డలు సర్పంచులుగా గెలవడం చాలా సంతోషకరమని అన్నారు.ప్రజలు కేసీఆర్ నాయకత్వం కోసం, బీఆర్ఎస్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మెజారిటీ స్థానాల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే గెలిచారని అన్నారు. ప్రభుత్వం సహకరించకపోయినప్పటికీ బీఆర్ఎస్ మద్దతుదారులు ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన నిలబడి కొట్లాడి సాధించుకుందామని అన్నారు.

## మా డబ్బులు ఇచ్చేయండి.. ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి కన్నీరు

రోజు ఫలితాలు వచ్చేశాయి. ఎన్నికల్లో గెలుస్తామనే ఆశతో.. పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు పెట్టినప్పటికీ కొందరు అభ్యర్థులు మాత్రం ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. దీంతో ఓటమిపాలైన అభ్యర్థులు కన్నీరు పెట్టుకుంటున్న పరిస్థితి. చివరకు ఎన్నికల్లో ఖర్చు పెట్టిన డబ్బులను తమకు తిరిగి ఇచ్చేయాలంటూ ప్రాధేయపడుతున్నారు. నల్లగొండ జిల్లాలో ఓ సర్పంచ్ అభ్యర్థి ఎన్నికల్లో ఓడిపోయాడు. దేవుడి ఫోటోతో ఇంటింటికీ తిరుగుతూ తన డబ్బులు ఇవ్వాలని కోరుతున్నాడు.

జిల్లాలోని నార్కట్ పల్లి మండలం ఔరవాణి గ్రామంలో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి ఇంటింటికీ తిరుగుతూ.. ఎన్నికల్లో ఓడిపోయానని ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని గ్రామస్తులను కోరుతున్నాడు. అయితే ప్రజలు మాత్రం అతడికే ఓటు వేసినట్లు చెబుతున్నారు. దీంతో ఓట్లు వేశామని చెబుతున్న ఓటర్లను దేవుడిపై ప్రమాణం చేయించుకుంటున్నాడు సదరు సర్పంచ్ అభ్యర్థి.

అందరూ తనకే ఓట్లు వేస్తే ఎలా ఓడిపోయానంటూ ఓటర్లను నిలదీస్తూ కన్నీరు పెట్టుకుంటున్నాడు. ఈ ఎన్నికల కోసం రూ. 10 లక్షలకు పైగా ఖర్చు చేశానని బాధితుడు వాపోతున్నాడు. మరికొన్ని గ్రామాల్లో కూడా ఓడిపోయిన అభ్యర్థులు ఇలానే తమ డబ్బులు తమకు ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వకపోతే చచ్చిపోతామంటూ ఓడిపోయిన అభ్యర్థులు బెదిరిస్తున్నట్లు సమాచారం.

## కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

### *ప్రజల కోసమే పని చేస్తున్న ప్రభుత్వం మాది-ఎమ్మెల్యే యశస్విని రెడ్డి*





**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామాలలో ఎమ్మెల్యే యశస్వి రెడ్డి కి డప్పు చాప్పులతో కోలాట బృందాలతో ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలు గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేద ప్రజలకు సన్న బియ్యం అందజేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు కూడా ప్రతి గ్రామాలలో అందజేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఇంకా మరెన్నో సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యేతెలిపారు.కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్త నాయకులను. కంటికిరెప్పలాకాపాడుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ఉచితంగా కరెంటు 200 యూనిట్లు ఫ్రీ ఇస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రతి పేదవాళ్లు సంతోషంగా ఉన్నారని తెలిపారు. మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, మండల నాయకులు,గ్రామ పార్టీ అధ్యక్షులు,మహిళలు, యూత్ నాయకులు, యూత్ అధ్యక్షులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

### *ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసింది బిఆర్ఎస్ పార్టీనే-ఉషా దయాకర్ రావు*






**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్):** దేవరుప్పుల మండలం బంజర,ధరావత్ తండ, దేవరుప్పుల,దుబ్బ తండా , లక్ష్మణ్ తండా గ్రామపంచాయతీలో స్థానిక సర్పంచ్ అభ్యర్థి ఎన్నికల్లో ఇంటింటి ప్రచారంలో పాల్గొని బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిలు ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవరుప్పుల మండల వ్యాప్తంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిన పనులు కనపడుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నమ్మి గ్రామ ప్రజలు మోసపోవద్దని మోసపోతే గోసపడతామని తెలిపారు. ఇప్పటికైనా ఆలోచించి బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రతి గ్రామ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్ల సుందర్ రం రెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


## తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సబ్మిట్ చివరి రోజు పాల్గొన్న ఘట్కేసర్ రైతులు

**ఘట్కేసర్ డిసెంబర్ 13 (నమస్తే హైదరాబాద్)**మేడ్చల్ జిల్లా, ఎల్బీనగర్ జోన్, ఘట్కేసర్ సర్కిల్ లోని ఘట్కేసర్ మండల రైతులు గ్లోబల్ సబ్మిట్ చివరి రోజులో వ్యవసాయంపై చర్చకు సుమారుగా 40 మంది పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రేసు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తలపెట్టిన తెలంగాణ రైసింగ్ 5 రోజుల కార్యక్రమంలో భాగంగా చివరి రోజు అయిన 13వ తారీకు రైతుల అవగాహన సదస్సులో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరూ రైతు కావాలని ఆలోచన రావడం కొరకు తన ప్రయత్నాలు తాను చేస్తున్నారని. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు పెట్టి అందరికీ రైతు నే రాజు చేయాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి డిస్ట్రిక్ట్ కందుకూర్ మండల్ మీర్కంపేట్ విలేజ్ లో జరగడం జరిగింది, ఈ కార్యక్రమానికి సహకరించిన డిసిఒ వెంకట రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ సహకార సంఘం అధ్యక్షుడు రామ్ రెడ్డి, ఈశ్వర్, పిట్టల శ్రీశైలం, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



# మెస్సి వర్సెస్ రేవంత్.. ఫుట్ బాల్ మ్యాచ్ ను తిలకించిన గడ్డం రవికుమార్





**ఉప్పల్ డిసెంబర్ 13 ( నమస్తే హైదరాబాద్):** హైదరాబాదులోని ఉప్పల్ స్టేడియంలో ప్రపంచ ఫుట్ బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మధ్య శనివారం సాయంత్రం మ్యాచ్ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో అభిమానుల కేరింతలతో మ్యాచ్ ఆసక్తిగా జరుగుతుంది. సింగరేణి %==%-అర్జెంటీనా టీం మధ్య రసవత్తరంగా కొనసాగింది. మ్యాచ్ ను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి గడ్డం రవికుమార్ అభిమానులతో కలిసి వీక్షించారు. ఇందులో భాగంగా మొదటగా రేవంత్ రెడ్డి గోల్ కొట్టి అభిమానుల మనసు గెలుచుకున్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ పెనాల్టీ షూటౌట్లో గోల్ కొట్టగా మెస్సీ చప్పట్లు కొట్టి అభినందించారు. అనంతరం మెస్సీ, రేవంత్ కలిసి స్టేడియంలో కలియతిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు.

# గ్రేటర్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలి:

**-ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**-పూడూరి జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం**

**-ఉప్పల్ డివిజన్ లో పార్టీ బలోపేతానికి ఎమ్మెల్యే దిశానిర్దేశం**



**ఉప్పల్, డిసెంబర్ 13 ( నమస్తే హైదరాబాద్):** గ్రేటర్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ నేతలకు పిలుపు ఇచ్చారు. శనివారం ఉప్పల్ లో పార్టీ సీనియర్ నాయకులు పూడూరి జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప్పల్ డివిజన్ లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, నిత్యం ప్రజల్లో ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఉప్పల్ కంచుకోట అని, నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే నాయకులకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అంతా ఐక్యంగా నిలిచి ఉప్పల్ లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చూపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్

*మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన మైనార్టీ నేత మహమ్మద్ రఫీక్*





**ఉప్పల్ డిసెంబర్ 13 ( సూర్య రేఖ):** రామంతపూర్ ఇందిరానగర్ కాలనీ లో అయ్యప్ప స్వాములు శ్రీను స్వామి, సాయి స్వామి, సుదర్శన్ స్వామి, హరి స్వామి, ధర్మారావు స్వామి, రాంబాబు స్వామి తదితర స్వాముల ఇరుముడి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్, ,గంగపుత్ర భాస్కర్ , పైల ఆదినారాయణ గౌడ్, సూరి, స్వామి, మధు తదితరులు పాల్గొన్నారు. శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. మైనార్టీ నాయకులు, రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వాములకు సొంత ఖర్చులతో అవసరమైన ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా గత పదిహేను రోజుల క్రితం గాంధీనగర్ కమ్యూనిటీ హాల్లో దాదాపు 500 మంది అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు.

# చిన్న క్యాప్స్యూల్‌ను మరిగే నీటిలో వేయగానే సెకన్లలోనే మ్యాగీ



కోట్లాది మంది భారతీయులకు ఇష్టమైన మ్యాగీ నూడిల్స్, నీటిలో వేయగానే నూడుల్స్‌గా మారే మ్యాగీ క్యాప్సూల్ వీడియోల ద్వారా వార్తల్లో నిలిచింది. ఈ వీడియోలు 40 మిలియన్ల వ్యూస్‌తో వైరల్ అయ్యాయి, కానీ అవి ఏఐ-జనరేటెడ్ అని తేలింది. దీనిపై మ్యాగీ ఇండియా సంస్థ స్పందిస్తూ, ఇవి ఏప్రిల్ ఫూల్స్ తరహా చిలిపి చేష్టలని పేర్కొంది. ఈ వీడియోల అప్రామాణికతను నెటిజన్లు కూడా గమనించారు.

మన దేశంలో దశాబ్దాలుగా అత్యంత ప్రజాదరణ పొందిన ఇన్‌స్టంట్ నూడిల్స్ బ్రాండ్ అయిన మ్యాగీ.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక విచిత్రమైన వీడియోతో వార్తల్లో నిలిచింది. ఆ వైరల్ వీడియోల్లో.. మ్యాగీ సంస్థ ఒక కొత్త క్యాప్సూల్‌ను విడుదల చేసిందని.. దాన్ని మరుగుతున్న నీటిలో వేయగానే వెంటనే క్షణాల్లో నూడుల్స్‌గా మారుతుందని ప్రచారం జరుగుతోంది. ఒక వీడియోలో ఒక వ్యక్తి.. బ్రాండ్ పేరు ఉన్న చిన్న పసుపు రంగు క్యాప్సూల్‌ను వేడి నీటిలో వేయగా.. అది వెంటనే నూడుల్స్, మసాలాగా మారుతున్నట్లు చూపించారు.

ఇక మరో వీడియోలో.. అంతకంటే చిన్న క్యాప్సూల్‌ను ఉపయోగించి ఒక మహిళ కూడా అదే విధంగా నూడుల్స్‌ను తయారు చేసింది. ఈ వీడియోలు 4 కోట్ల వ్యూస్‌ను సాధించడంతో.. అసలు మ్యాగీ సంస్థ ఈ కొత్త క్యాప్సూల్ తీసుకువచ్చిన విషయం నిజమా కాదా అని నెటిజన్లు తీవ్ర గందరగోళంలో పడ్డారు. అయితే.. ఈ వైరల్ వీడియోలు అన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని ఉపయోగించి సృష్టించినవి అని తేలింది. ఈ మ్యాగీ క్యాప్స్యూల్ వీడియో నెట్టింట బాగా ట్రెండింగ్‌గా మారడంతో.. ఎట్టకేలకు ఈ ప్రచారంపై మ్యాగీ ఇండియా సంస్థ అధికారికంగా స్పందించింది.

ఇక వైరల్ అవుతున్న వీడియోల కింద మ్యాగీ ఇండియా చేసిన కామెంట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. దయచేసి ఇతర నెలల్లో కూడా ఏప్రిల్ ఫూల్స్ డే జరుపుకోకండి అంటూ.. మ్యాగీ ఇండియా సంస్థ చమత్కారంగా కామెంట్ చేసింది. మరోవైపు.. ఆ వీడియోల ప్రామాణికతపైనా నెటిజన్లు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఫోర్క్ ఆకారం వంగి ఉందని గుర్తించగా.. మరికొందరు ఆ వీడియోల్లో మనుషుల హావభావాలు సరిగ్గా లేవని విమర్శలు గుప్పిస్తున్నారు. ఏఐ హద్దులు దాటిపోతోందని ఇంకో యూజర్ వ్యాఖ్యానించారు.



# పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ప్రచారానికి ప్రజాదరణ

**బ్యాటు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కలుస్తున్న అభ్యర్థి**

**గెలిపిస్తే గ్రామ ప్రజలకు సేవ చేస్తా**

**సర్పంచ్ అభ్యర్థి పెద్ది కృష్ణమూర్తి గౌడ్**



**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్ ):** దేవరుప్పుల గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో సేవ్ కాంగ్రెస్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ప్రజల మధ్యే ఉండి ప్రచారం నిర్వహిస్తూ.విశేష ఆదరణ పొందుతున్నారు. వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ గ్రామాభివృద్ధిపై తన దృక్పథాన్ని వివరించారు.ప్రజలతో నేరుగా మమేకమవుతూ, తనకు కేటాయించిన బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా బట్టలు ఇస్త్రీ చేస్తున్న ఓటర్ వద్దకు వెళ్లి స్వయంగా బట్టలు ఇస్త్రీ చేస్తూ ఓటును అభ్యర్థించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ఆయన ప్రజలకు ఎంత దగ్గరగా ఉన్నారనే దానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో. వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య, తోటకూరి రమేష్, తోటకూరి మహేష్, గోడిశాల శ్రీను, జోగు యాదగిరి, ఉప్పుల పుష్ప, చింత సుమలత, కారుపోతుల శైలజ, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్, మండల యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల అనిల్ తదితరులు పాల్గొని ప్రచారానికి మద్దతు తెలిపారు.

# నిర్మాల గ్రామ సర్పంచ్ అభ్యర్థి జోరుగా ఇంటింటి ప్రచారం ..!

పల్లెర్ల సంధ్యారాణి బ్యాట్ గుర్తుకు ఓటు వేయండి



**దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్) :** దేవరుప్పుల మండలం నిర్మాల బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన గ్రామ సర్పంచ్ అభ్యర్థి పల్లెర్ల సంధ్య రాణి బ్యాట్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శనివారం ప్రతి గడపగడపకు జోరుగా ప్రచారం నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ వార్డు నెంబర్లు తో కలిసి ప్రచారం చేసిన పిఎసిఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మల గ్రామం అభివృద్ధి గతంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిన పనులు గెలిపిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గెలిచి రెండు సమస్యలు పూర్తి చేసిన సందర్భంగా గ్రామంలోని ఒక పని కూడా చేయలేదని కొత్త జలంధర్ రెడ్డి తెలిపారు. గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే మీ అమూల్యమైన బ్యాటు గుర్తుకు ఓటు వేయాలని నిర్మల గ్రామ ప్రజలకు తెలిపారు.

# ఎరుకల బస్తి మసీదు రోడ్డును త్వరలో వేయిస్తాం:

నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్



**ఉప్పల్, డిసెంబర్ 13 ( నమస్తే హైదరాబాద్):** నాచారం ఎరుకల బస్తీలో మసీదు రోడ్డు పూర్తిగా గుంతలుగా మారి అధ్వానంగా తయారైందని వచ్చే రంజాన్ పండుగ వరకు సిమెంట్ రోడ్లు వేయాలని జామియా మసీదు నూతన అధ్యక్షులు సయ్యద్ సయీద్ నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ కు వినతి పత్రం అందజేశారు.సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే మసీదు రోడ్డు వేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. రోడ్డు వేయడమే కాకుండా డివిజన్లోని అన్ని మసీదుల వద్ద రంజాన్ వరకు అవసరమైన ఏర్పాట్లు చేరినట్లు ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహమ్మద్ జమీల్ అహ్మద్, సయ్యద్ తాహెర్ మహమ్మద్, ఫరూక్ మహమ్మద్, యూసుఫ్ షేక్ మహబూబ్ మహమ్మద్, జమీల్ అహ్మద్ మహమ్మద్, కామిల్ సయ్యద్, లతీఫ్ బి ఆర్ ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ లో బీఆరెస్ కు బిగ్ షాక్

- కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉప్పల్ నూర్ భాషా దూదేకుల సంఘం నేతలు.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్ డిసెంబర్ 13 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ నియోజకవర్గంలో ఉప్పల్ నూర్ భాషాదూదేకుల సంఘం నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో... అల్లా భాషా,జానయ్య,నాయప్ప రసూల్,రామ్ రెడ్డి,నడిపి రోశయ్య,కాసిం వల్లి,నాగూర్ భాషా,పీరంభి ,శిరయ్య,సిద్ధయ్య,నడిపి సిద్దయ్య,ఉస్సని,చిన్న మౌలయ్య,రోశయ్య,నాయబ్ రసూల్,పెద్ద సిద్దయ్య,చింతలయ్య, కాసిం, సిద్దయ్య,పెద్ద పీరయ్య,మల్లికార్జున్,చిన్న పీరయ్య,పకీరయ్య, భవాని,రాజు,శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఉప్పల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాలకు కమిటీ హాల్ ల నిర్మాణాలకు ముఖ్య మంత్రి సారథ్యంలో నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని కులాల వారికి సముచిత స్థానం కల్పిస్తుందని నమ్మకంతో పార్టీలో చేరినట్లు తెలిపారు.

## పి హెచ్ డి పట్టా పొందిన గణిత శాస్త్ర అధ్యాపకురాలు స్వప్న టంగుటూరి



**ఉప్పల్, డిసెంబర్ 13 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల లో గణితశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న స్వప్న టంగుటూరికి చైతన్య (డీమ్డ్ టు బీ) యూనివర్సిటీ గణితశాస్త్రంలో పీహెచ్‌డీని ప్రదానం చేసింది.

పీహెచ్ డీ పట్టా పొందిన ఆమె "కంబైన్డ్ ఎఫెక్ట్స్ ఆఫ్ థర్మల్ అండ్ సొల్యూటల్ ఆన్ మైక్రోపోలార్ ఫ్లూయిడ్ అలాంగ్ ఏ స్ట్రెచ్డ్ సర్ఫేస్" అనే పరిశోధనా పత్రాన్ని డా. ఎం. సుందర్ రావ్ పర్యవేక్షణలో సమర్పించారు.పీహెచ్‌డీ పట్టా లభించడం ఆమె అంకితభావం, పరిశోధన మరియు బోధనా రంగాలలో ఆమె సాధించిన ముఖ్యమైన విద్యా విజయాన్ని ప్రతిబింబిస్తుంది. పరిశోధన లో పీహెచ్ డీ పట్టా సాధించిన స్వప్న టంగుటూరి ని తోటి మిత్ర బృందం, లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వప్న టంగుటూరి మాట్లాడుతూ తాను చేసిన పరిశోధనకు తగిన ఫలితం లభించిందని సంతోషంగా ఉందని వెల్లడించారు. శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.




## అక్రమ సంపాదనతో కానిస్టేబుల్ భారీ భవంతి, ఈడీ దర్యాప్తుతో వెలుగులోకి

కోడిన్ ఆధారిత దగ్గు సిరప్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ దర్యాప్తులో ఈడీ అధికారులు సంచలన విషయాలను వెలుగులోకి తీసుకువచ్చారు. డిస్మిస్ అయిన ఉత్తర్‌ప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ అలోక్ ప్రతాప్ సింగ్‌కు చెందిన లక్నోలోని ఇల్లు, ఆస్తులకు సంబంధించిన సంచలన విషయాలను బయటపెట్టారు. లక్నోలోని అలోక్ ప్రతాప్ సింగ్ ఇంటికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. అతని ఆస్తులు చూసి నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఈడీ అధికారుల విచారణలో.. తాను రూ.5 లక్షల పెట్టుబడి పెట్టి అక్రమ అమ్మకాల ద్వారా రూ.20 లక్షల నుంచి రూ.22 లక్షల లాభం పొందినట్లు అలోక్ అంగీకరించాడు. ఈ నెట్‌వర్క్‌లో ఫెన్సిడైల్ మళ్లింపు ఆపరేషన్లను వారణాసికి చెందిన శుభం జైస్వాల్, ధన్‌బాద్‌లో శ్రేయసి మెడికల్ ఏజెన్సీ వంటి నకిలీ సంస్థలను స్థాపించడానికి అలోక్ గుర్తింపును ఉపయోగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. యూపీ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసిన అలోక్ ప్రతాప్ సింగ్.. ఈ కేసులో ఆరోపణలు రావడంతో.. ఇటీవల డిస్మిస్ అయ్యారు.

శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్, జార?ండ్, గుజరాత్ రాష్ట్రాల్లో ఏకకాలంలో కోడిన్ ఆధారిత దగ్గు సిరప్‌ల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లో అలోక్ ప్రమేయంపై ఈడీ తనిఖీలు నిర్వహించింది. అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌లో భాగమైన అలోక్‌ను ఫెన్సిడైల్, ఇతర కోడిన్ ఆధారిత దగ్గు సిరప్‌ల అక్రమ నిల్వ, మళ్లింపు, రవాణా ఆరోపణలపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ డిసెంబర్ 2వ తేదీన లక్నోలో అరెస్ట్ చేసింది.

విచారణ సందర్భంగా.. వారణాసికి చెందిన ప్రధాన సూత్రధారి శుభం జైస్వాల్‌ను అజంగఢ్‌కు చెందిన వికాస్ సింగ్ ద్వారా కలిసినట్లు అలోక్ వెల్లడించాడు. రాంచీ నుంచి శైలి ట్రేడర్స్ అనే నకిలీ సంస్థను జైస్వాల్ అడ్డుపెట్టుకుని.. ఫెన్సిడైల్ మళ్లింపు కార్యకలాపాలను నిర్వహించేవాడని గుర్తించారు. వీటిని పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లకు అక్రమంగా రవాణా చేసి భారీ లాభాలు సంపాదించారు.

అలోక్, గతంలో అరెస్ట్ అయిన అతని పార్ట్‌నర్ అమిత్ కుమార్ సింగ్ అలియాస్ అమిత్ టాటా.. ఈ అక్రమ వ్యాపారంలో పెట్టుబడి పెట్టారు. జైస్వాల్, వరుణ్ సింగ్, గౌరవ్ జైస్వాల్, విశాల్ మెహ్రోత్రాలతో కలిసి.. 2024 జనవరిలో ధన్‌బాద్‌లో అలోక్ ఐడీ కార్డును ఉపయోగించి నకిలీ మెడికల్ సంస్థ అయిన శ్రేయసి మెడికల్ ఏజెన్సీని స్థాపించారు. ఈ సంస్థల ఆర్థిక లావాదేవీలన్నీ జైస్వాల్, అతని చార్టర్డ్ అకౌంటెంట్ నిర్వహించేవారు. ఆ తర్వాత అలోక్ ఫోర్జరీ చేసిన డ్రగ్ లైసెన్స్‌ను ఉపయోగించి వారణాసిలో మా శారద మెడికల్ అనే మరో ఫేక్ సంస్థను సృష్టించారు. ఈ సంస్థలు నకిలీ ఇన్‌వాయిస్‌లు, ఈ-వే బిల్లులను సృష్టించేందుకు ఉపయోగించుకున్నారు. అమిత్, అలోక్ కలిసి చెరో రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టామని.. వాటి అక్రమ అమ్మకాల ద్వారా రూ.20-22 లక్షల లాభాలు పొందినట్లు అలోక్ విచారణలో అంగీకరించాడు. డ్రగ్ లైసెన్స్ పొందడానికి ఉపయోగించిన ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లను కూడా ఫోర్జరీ చేసినట్లు అలోక్ తెలిపాడు.



## ఉప్పల్ ఓల్డ్ విలేజ్ లో రూ.60 లక్షల తో సీసీ రోడ్ నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, డిసెంబర్ 13 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ లోని ఓల్డ్ విలేజ్(భరత్ నగర్)లో 60 లక్షల తో సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు . ఇటీవలనే కార్పొరేటర్ కాలనీల్లో పర్యటించిన సందర్భంగా సీసీ రోడ్డు,డ్రైనేజీ పనులను చేయిస్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ,ఏ.ఈ. రాజ్ కుమార్ తో కలిసి ఓల్డ్ విలేజ్ భరత్ నగర్ లోని మాల్ మైసమ్మ ఆలయం ఏరియాలో జరుగుతున్న పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే ఉప్పల్ ఓల్డ్ విలేజ్ భారత్ నగర్ లో పెండింగ్‌లో ఉన్న ఓపెన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా చేపట్టాలని అధికారులకు సూచించారు. త్వరలోనే పెండింగ్లో ఉన్న ఓపెన్ డ్రైన్, సిసి రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అధికారులు కార్పొరేటర్ కు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పోగుల నర్సింహా రెడ్డి,పోగుల సత్తి రెడ్డి,మహంకాళి రాజు,సల్లా ప్రభాకర్ రెడ్డి,ఈగ శ్రీధర్,రంగుల శేఖర్ ముదిరాజ్,కాయల సుధాకర్,కాయల యాదయ్య,తైసీన్,బచ్చ రామ్, తోట రాంచందర్,గణేష్,శ్రీకాంత్,శ్రీధర్ రెడ్డి,రవి తదితరులు పాల్గొన్నారు.

## మెస్సీ ఫ్యాన్స్‌కు క్షమాపణలు చెప్పిన సీఎం..

### కమిటీ ఏర్పాటు, వివరణ కోరిన గవర్నర్

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. కోల్‌కతాలో మెస్సీ టూర్ సందర్భంగా సాల్ట్ లేక్ స్టేడియం వద్ద ఆయన అభిమానులు అదుపు తప్పి భద్రతా వలయాలను ఛేదించుకుని వచ్చి స్టేడియంలో విధ్వంసం సృష్టించారు. దాదాపు అరగంట పాటు మెస్సీ అక్కడ ఉన్నా.. తమ అభిమాన ఆటగాడిని చూడలేకపోయిన కోపంతో వారు ఈ అల్లర్లకు దిగారు. ఈ ఘటన నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. మెస్సీకి, ఆయన ఫ్యాన్స్‌కు క్షమాపణలు చెప్పారు. జరిగిన సంఘటనపై విచారణ కోసం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

ఈ అనూహ్య సంఘటనపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సీఎం మమతా బెనర్జీ.. ఈ దురదృష్టకర సంఘటనపై మెస్సీకి, క్రీడాభిమానులకు క్షమాపణ చెప్పారు. ఈ ఘటన కారణాన్ని గుర్తించడానికి.. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా నివారించడానికి.. రిటైర్డ్ జడ్జి ఆశిమ్ కుమార్ రే అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం శాఖ కార్యదర్శి సభ్యులుగా విచారణ కమిటీని నియమించారు. రూ. 3,500 నుంచి రూ. 14,000 వరకు టికెట్లు కొన్నప్పటికీ మెస్సీని చూడలేకపోతున్నామనే కారణంగానే ఈ అల్లర్లు చెలరేగాయని.. బీజేపీ నేతలు అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ఇవాళ కోల్‌కతాకు చేరుకున్నారు. సాల్ట్ లేక్ స్టేడియంలో మెస్సీని చూసేందుకు వచ్చిన వందలాది మంది అభిమానులు తమ అభిమాన ఆటగాడిని చూడలేకపోవడంతో ఆగ్రహంతో సెక్యూరిటీ ప్రోటోకాల్‌లను ఉల్లంఘించారు. బాటిల్స్, కుర్చీలు విసిరి.. సాల్ట్ లేక్ స్టేడియం ఆస్తులను ధ్వంసం చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో.. గోట్ టూర్ నిర్వాహకులు.. ప్రమోటర్ శతద్రు దత్తాతో కలిసి వెంటనే అక్కడి నుంచి మెస్సీని తరలించాల్సి వచ్చింది, దీంతో ఆ ఈవెంట్ అర్ధాంతరంగా ముగిసింది.

సాల్ట్ లేక్ స్టేడియంలో జరిగిన ఈ గందరగోళం కారణంగా సూపర్ స్టార్ షారుక్ ఖాన్, టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనలేకపోయారు. సాల్ట్ లేక్ స్టేడియం వద్ద సరైన కార్యక్రమ నిర్వహణ లేకపోవడం తనను షాక్‌కు గురి చేసిందని మమతా బెనర్జీ పేర్కొన్నారు. అది




చూసి తాను తీవ్ర ఆందోళన చెందానని.. ఈ దురదృష్టకర సంఘటన జరిగిన నేపథ్యంలో లియోనెల్ మెస్సీకి, అలాగే క్రీడాభిమానులందరికీ తాను హృదయపూర్వకంగా క్షమాపణలు చెబుతున్నానని దీదీ ప్రకటించారు.

ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి.. బాధ్యులను గుర్తించడానికి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అడ్డుకునేందుకు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సంఘటనను బీజేపీ తీవ్రంగా విమర్శిస్తూ.. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించింది. అంతర్జాతీయ వేదికపై ఇది చాలా అవమానమని బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు.

మెస్సీ వంటి అంతర్జాతీయ దిగ్గజం వస్తున్నప్పటికీ.. కనీస ప్రణాళిక గానీ, భద్రత గానీ లేదని ఆయన మమతా బెనర్జీని విమర్శించారు. ఇది చరిత్ర పేజీల్లో చెరిగిపోని పెద్ద అవమానమని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాల్వియా అభివర్ణించారు. సామాన్య ప్రజల భావోద్వేగాలతో ఆడుకున్నందుకు.. పశ్చిమ బెంగాల్ క్రీడా శాఖ మంత్రి అరూప్ బిస్వాస్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కమిషన్లు ఖాళీ రాజ్యాంగబద్ధ పదవుల భర్తీ ఎప్పుడు?

**చైర్మన్లు, కమిషనర్లు లేక సంస్థల వెలవెల రెండేళ్లుగా ఏపీఈఆర్సీ, ఏపీహెచ్ఆర్సీ ఖాళీ ఆర్టీఐ, ఏపీపీఎస్సీ, లోకాయుక్త, బీసీ కమిషన్ వంటి అనేక సంస్థలు కూడా అదే బాటలో హైకోర్టు ప్రశ్నించినా పట్టించుకోని ప్రభుత్వం**




**నమస్తే హైదరాబాద్ :**రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రభుత్వం ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా కీలకమైన కమిషన్లకు చైర్మన్లు, సభ్యుల నియామకంలోనూ ఎడతెగని జాప్యం చేస్తోంది. దీంతో అటు న్యాయపరంగా కూడా చిక్కులు ఎదురవుతున్నాయి. వాస్తవానికి నామినేటెడ్ పదవుల భర్తీవిషయంలో ఎడతెగని జాప్యం చేసిన ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన మూడు నెలల తర్వాత తొలి జాబితా విడుదల చేసింది. ప్రస్తుతం నామినేటెడ్ పదవుల భర్తీ దాదాపు ఓ కొలిక్కి వచ్చింది. అయితే, కీలకమైన రాజ్యాంగ బద్ధ పదవుల భర్తీ విషయంలో మాత్రం ఇంకా చర్యలు తీసుకోలేదు. కీలక పోస్టుల భర్తీలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటోందని ఈ ఏడాది సెప్టెంబరులో హైకోర్టు కూడా ప్రశ్నించింది. రాజ్యాంగ బద్ధ పదవుల భర్తీని ఎప్పటిలోగా చేపడతారో తెలియజేయాలని ఆదేశించింది. ఇది జరిగి మూడు నెలలు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నామినేటెడ్ పదవుల మాదిరి రాజ్యాంగ బద్ధ పదవులకు కుల సమీకరణాలు చూసుకోవాల్సిన అవసరం లేదు. అర్హత, విధేయతను ప్రామాణికంగా తీసుకుంటే సరిపోతుంది. అయినా.. వీటి భర్తీలో జాప్యం జరుగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గతంలోనూ ఇదే తీరు..

టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారీ నామినేటెడ్ పదవులు.. రాజ్యాంగబద్ధ పదవుల భర్తీపై పెద్దగా దృష్టి సారించడం లేదన్న వాదన ఉంది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా నామినేటెడ్, రాజ్యాంగ బద్ధ పదవుల భర్తీలో జాప్యం చేస్తూ వచ్చారు. ఓ వైపు రాష్ట్ర విభజన మరో వైపు రెవెన్యూ లోటు వంటి సమస్యలతో రాష్ట్రంపై ఆర్థికంగా భారంపడే అవకాశం ఉందని భావించి అప్పట్లో వీటి భర్తీ విషయంలో జాప్యం చేశారన్న ప్రచారం జరిగింది.

**లేనివి కూడా సృష్టించి!**

2019లో వచ్చిన జగన్ సర్కార్ ఎడాపెడా నామినేటెడ్, రాజ్యాంగ బద్ధ పదవులు భర్తీ చేసింది. అంతేకాదు కొత్తగా పదుల సంఖ్యలో కార్పొరేషన్లను సృష్టించి మరీ పదవుల పందేరం చేసింది. కార్పొరేషన్ల చైర్మన్లకు కార్యాలయాలు, కుర్చీలు లేకపోయినా వారి జీతాల విషయంలో మాత్రం ఉదారత కనబరిచింది.

**తక్షణం భర్తీ చేయాల్సినవి ఇవీ..**

రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ పదవి 2024, ఫిబ్రవరి నుంచే ఖాళీగా ఉంది. ఈ కమిషన్‌లో చైర్మన్‌తోపాటు నలుగురు సభ్యులు ఉంటారు. ప్రస్తుతం ఇద్దరు సభ్యులు మాత్రమే ఉన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారంలో కమిషన్ పాత్ర కీలకంగా ఉంటుంది. అలాంటి పదవిని సుమారు రెండేళ్లు నుంచి ఖాళీగా ఉంచారు.

ఏపీ సమాచార హక్కు కమిషన్(ఆర్‌టీఐ)లో చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌తోపాటు 10 మంది వరకు కమిషనర్లను నియమించుకునే వెసులుబాటు ఉంది. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పదవీకాలం ఈ ఏడాది అక్టోబరుతో పూర్తయింది. ప్రస్తుతం కేవలం ముగ్గురు కమిషనర్లు మాత్రమే ఉన్నారు. దీంతో అప్పీళ్ల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)లో చైర్మన్ పదవి ఈ ఏడాది అక్టోబరులో ఖాళీ అయింది. మొత్తం 9 మంది సభ్యులకుగాను 3 పోస్టులు ఏడాదిగా ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ, పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల ప్రక్రియపై కమిషన్‌లోని ఖాళీలు ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఏపీ హెచ్ఆర్సీ(మానవహక్కుల కమిషన్) చైర్మన్ పదవి 2024, మార్చి నుంచి ఖాళీగా ఉంది.

ఏపీ ఈఆర్సీ(విద్యుత్తు నియంత్రణ) చైర్మన్ పదవి 2024, అక్టోబరు నుంచి ఖాళీగా ఉంది.

ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ పదవి ఇటీవలే ఖాళీ అయింది.

ఏపీ వక్ఫ్, ఎండోమెంట్ ట్రైబ్యునళ్లు ఏడాదికిపైగా ఖాళీగా ఉన్నాయి.

ఏపీ లోకాయుక్త.. 2024, సెప్టెంబరు నుంచి ఖాళీగా ఉంది.

బాలల హక్కుల కమిషన్, బీసీ కమిషన్ వంటి పలు రాజ్యాంగబద్ధ సంస్థలకు చైర్మన్ల నియామకం జరగాల్సి ఉంది.

# భాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన చల్లగుళ్ల ఆదిత్య చౌదరి



**నమస్తే హైదరాబాద్ :** భాధిత కుటుంబానికి ఆర్ధిక సహాయం అందించిన చల్లగుళ్ల ఆదిత్య చౌదరి అల్లూరు గ్రామంలో నిరుపేద కుటుంబాని కి చెందిన తోట నాగరాజు,లక్ష్మి దంపతుల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా అహుతి కాగా వారికి బాసటగా చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి ఆదేశాలతో ఆదిత్య చౌదరి 10,000-రూపాయలు ఆర్థిక సహాయం అందించి భాదితులకు బాసటగా నిలిచి అధికారులుకి తెలియచేసి తగిన సహాయ,సహకారాలు అందిస్తామని భరోసా కల్పించి ధైర్యాన్ని నింపారు, ఈ కార్యక్రమం లో తెలుగుదేశం మండల నాయకులు బొంగురవి,దావు నాగరాజు, వల్లూరుపల్లి భాను, ఎన్.డీ.ఏ.కూటమి నాయకులు పాల్గొన్నారు

# 21న పల్స్ పోలియో



**నమస్తే హైదరాబాద్ :**అమరావతి, డిసెంబరు 13: పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఈనెల 21న నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్లలోపు వయసున్న 54,07,663 మంది పిల్లలకు 38,267 బూత్‌ల్లో పోలియో చుక్కలు వేసేందుకు 61.26 లక్షల డోస్‌లను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పంపించినట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, మేళాలు, బజార్లు, పర్యాటక ప్రదేశాల్లో 1140 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 21న పోలియో దినం సందర్భంగా బూత్ స్థాయిలో పిల్లలకు పోలియో చుక్కల్ని వేస్తారని, ఆ రోజు ఏదైనా కారణంతో పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన పిల్లలకు 22, 23 తేదీల్లో 76,534 బృందాలు ఇంటింటికి వెళ్లి పోలియోచుక్కలు వేస్తాయని వివరించారు. 1704 మంది వైద్యాధికారులు, 39,494 మంది ఇతర సిబ్బంది, 4206 మంది పర్యవేక్షకులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సంచార జాతులు, నిర్మాణ స్థలాలు, ఇటుక క్షేత్రాలు, ఇతర వలస ప్రాంతాలు కవర్ చేయడానికి 1854 మొబైల్ బృందాలు పని చేస్తాయన్నారు. ప్రతి మొబైల్ బృందంలో ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారన్నారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రధాన ఆస్పత్రులు, మేళాలు, బజార్లలో 21, 22, 23 తేదీల్లో బృందాలు పర్యటిస్తాయన్నారు.

# పోలవరం-నల్లమలసాగర్‌పై సుప్రీంలో కేవియట్

**దాఖలుకు రాష్ట్రం నిర్ణయం.. ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ కేసు వేసే యోచన నేపథ్యంలో అప్రమత్తం**

**నమస్తే హైదరాబాద్ :**అమరావతి, డిసెంబరు 13: పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకంపై సుప్రీం కోర్టులో కేవియెట్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలని యోచిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను తయారు చేసేందుకు ఆసక్తి గల సంస్థల నుంచి ఇప్పటికే జలవనరుల శాఖ బిడ్లను ఆహ్వానించింది. ఇందుకు తుది గడువు ఈ నెల 11వ తేదీతో ముగియగా, రెండు సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. జలవనరుల శాఖ వీటిని పరిశీలిస్తోంది. ఎల్-1గా వచ్చిన సంస్థకు డీపీఆర్ తయారీ బాధ్యతను అప్పగించేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య జల వివాదం పరిష్కారమయ్యేంత దాకా కొత్త ప్రాజెక్టులు కట్టకుండా ఏపీని నిలువరించాలని కోరుతూ కేంద్ర జల శక్తి కార్యదర్శి వీఎల్‌కాంతారావుకు శనివారం తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి లేఖ రాశారు. పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకం డీపీఆర్‌ను తయారు చేయకుండా నిలువరించాలని కోరారు. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు సుప్రీం కోర్టులో కేసు వేయాలని నిర్ణయించినట్టు తెలంగాణ నీటి పారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీలో న్యాయపరమైన సంప్రదింపులు చేపట్టింది. దీంతో రాష్ట్ర జలవనరుల శాఖ అప్రమత్తమైంది. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేలా జలవనరుల శాఖ అంతర్రాష్ట్ర విభాగం, కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీరుకు బాధ్యతలు అప్పగించింది. సుప్రీం కోర్టులో కేవియెట్ వేసే బాధ్యతలనూ అప్పగించింది. డీపీఆర్ తయారీని అడ్డుకునే హక్కు ఇతర రాష్ట్రాలకు ఉండదని జలవనరుల శాఖ చెబుతోంది. సముద్రంలో కలిసే గోదావరి వరద జలాలను దిగువ రాష్ట్రంగా సద్వినియోగం చేసుకుంటామని అంటోంది. ఈ హక్కును కాదనే అధికారం ఎవరికీ లేదని చెబుతోంది. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు న్యాయ పోరాటం చేస్తామని 'ఆంధ్రజ్యోతి'కి జలవనరుల శాఖ అధికారులు చెప్పారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు కోసం డీపీఆర్ తయారు చేయకుండా నిలువరించాలంటూ సుప్రీం కోర్టులో తెలంగాణ కేసు



వేసినా న్యాయపరంగా నిలువబోదని అన్నారు.

ఛానల్ ఫాలో అవ్వండి పోలవరంలో రెండో రోజు సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు

పోలవరం, డిసెంబరు 13: పోలవరం ప్రాజెక్టులో మట్టి, రాయి నాణ్యత పరీక్షలను శనివారం రెండో రోజూ సెంట్రల్ శాయిల్ మెటీరియల్ రీసెర్చి సెంటర్ (సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్తల బృందం నిర్వహించింది. శాస్త్రవేత్తలు హరేంద్ర ప్రకాశ్, ఉదయ్ భాను చక్రవర్తి, సిద్ధార్థ్ పి.హెడవు ప్రాజెక్టు గ్యాప్ 1, 2 ప్రాంతాల్లో మట్టి నాణ్యత, రాయి పటిష్ఠతను పరీక్షించారు. ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాంలో వినియోగించే మట్టి, రాయి నాణ్యత ప్రమాణాలనూ పరిశీలించారు. కొన్ని శాంపిల్స్ సేకరించారు. ఇంజనీరింగ్ చీఫ్ ఎన్.నరసింహమూర్తికి సేకరించిన శాంపిల్స్ స్వభావం గురించి వివరించి మరికొన్ని పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని, పరీక్షల అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ బృందం ఆదివారం ఢిల్లీ బయల్దేరి వెళ్తుంది. కేంద్రం జల వనరుల శాఖకు ప్రాజెక్టు వద్ద నిర్వహించిన పరీక్షలపై నివేదిక ఇస్తుంది. బృందంతో పాటు ఈఈలు డి.శ్రీనివాస్, బాలకృష్ణ, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఎ.గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి, మేనేజర్లు వెంకటేశ్, గణపతిరావు తదితరులు ఉన్నారు.

# తిరుమలలో రజనీకాంత్



**నమస్తే హైదరాబాద్ :**తిరుమల, డిసెంబరు 13 : సూపర్‌స్టార్ రజనీకాంత్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం రాత్రి కుటుంబంతో ఆయన తిరుమలకు చేరుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో భార్య లత, కుమార్తెలు ఐశ్వర్య, సౌందర్య, మనవళ్లు యాత్ర, లింగ, బావమరిది, సంగీత దర్శకుడు అనిరుధ్ తల్లిదండ్రులు రవిచంద్రన్, లక్ష్మిలతో కలిసి క్యూలైన్ ద్వారా ఆలయంలోకి వెళ్లారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తీర్థప్రసాదాలు అందజేశారు. రజనీకాంత్ తన బరువు 73 కేజీలకు సమానంగా బెల్లం, బియ్యం, చక్కెరతో తులాభారం మొక్కులు చెల్లించారు. మిగిలిన కుటుంబ సభ్యులు కూడా దాదాపు 500 కేజీల తులాభారం మొక్కులు తీర్చారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల రజనీకాంత్‌ను చూసేందుకు అభిమానులు భారీగా ఎగబడ్డారు. 'తలా, తలైవా, సూపర్‌స్టార్' అంటూ కేకలు వేశారు. అభిమానులకు నమస్కరిస్తూ ఆయన ముందుకు సాగారు. కొందరితో కరచాలనం చేసి చిరునవ్వుతో పలకరించారు. కాగా భద్రతాసిబ్బంది రజనీకాంత్‌ను వాహనం వద్దకు తీసుకువెళ్లే క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. దీంతో సమీపంలో ఉన్న పండితుడు ఒకరు కిందపడ్డారు. గుర్తించిన భక్తులు ఆయన్ను వెంటనే పైకిలేపారు.

# ఏఐతో కొన్ని ఉద్యోగాలకు ధోకా లేదన్న రఘురాం రాజన్

**నమస్తే హైదరాబాద్ :**కృత్రిమ మేధ కారణంగా ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలపై ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ స్పందించారు. ఏఐతో కొన్ని ఉద్యోగాలకు ముప్పు లేదని, అయితే అలాంటి ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేయలేకపోతున్నామని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, సరైన శిక్షణ లేని శ్రామిక శక్తితో ఏఐ ఆధారిత భవిష్యత్తు వైపు భారత్ అడుగులు వేస్తోందని అన్నారు.కొన్ని ఉద్యోగాలు ఏఐతో భర్తీ కావని, వాటిని మనుషులే చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఉదాహరణకు ప్రస్తుత ఏఐ యుగంలో ప్లంబర్ ఉద్యోగం వెంటనే పోకపోవచ్చని అన్నారు. ఏఐ ప్రభావం లేని ప్లంబింగ్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ మరమ్మతు వంటి ఆటోమేషన్ కారణంగా ప్రభావితం కాని కొన్ని ఉద్యోగాల గురించి ఆయన ప్రస్తావించారు. వీటికి కావలసిన నైపుణ్యాలు ప్రస్తుత విద్యావ్యవస్థ ద్వారా అందడం లేదని అభిప్రాయపడ్డారు.ప్రస్తుత వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఫ్రెంచ్, ఇంగ్లీష్ సాహిత్యంలో డిగ్రీ కంటే ఆధునిక ప్లంబింగ్ కోర్సును తాను సంతోషంగా చేస్తానని రఘురాం రాజన్ అన్నారు. ప్లంబర్‌కు అన్ని రకాలుగా వ్యాపార మెలకువలు తెలిసి ఉండాలని అన్నారు. అందుకు అనుగుణంగా సంస్కరణలు అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. పిల్లలకు శారీరక, మానసిక ఎదుగుదలకు, భవిష్యత్తులో పోటీ ప్రపంచంలో రాణించేందుకు పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చెయ్యాలి

**నమస్తే హైదరాబాద్ :** ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చెయ్యాలి అన్న ముదినేపల్లి ఎం.పీ.పీ. రామిశెట్టి సత్యనారాయణ..ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో సమావేశపు మందిరంలో ఎం.పీ.పీ. రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆయా శాఖలకు సంబంధించి అభివృద్ధి, సంక్షేమంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు...ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు దృష్టి సారించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.అలాగే ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగాలి అని రైతులు ఎవ్వరు ఇబ్బంది పడకుండా చూడాలని అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ని ఆదేశించారు,అలాగే పంచాయతీలలో వీధిదీపాలు సక్రమంగా వెలిగేలాగా చూడాలన్నారు.. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంగా కలసి పనిచేసి ముదినేపల్లి మండలాభివృద్ధికి తోడ్పాడాలని ఎంపీపీ కోరారు. విద్యాశాఖ అధికారితో మాట్లాడుతూ ఈ సంవత్సరం టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ లో ముదినేపల్లి మండలం మొదటి స్థానంలో ఉండేలాగా చర్యలు తీసుకోవాలని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి తీసుకుని పాస్ పర్సంటేజ్ పెరిగేలాగా చూడాలన్నారు.. తూర్పుపాకల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో మొందా తుఫాను కారణంగా వృక్షం పాఠశాలపై పడడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు ఇటీవల ఎం.పీ.పీ. పరిశీలించి పక్కనే ఉన్న కమ్యూనిటీ హాల్ ను మండల పరిషత్ నిధుల నుంచి రిపేర్ వర్క్ చేపిస్తామని విద్యార్థులకు ఇబ్బంది లేకుండా యధావిధిగా కొనసాగేలాగా చర్యలు తీసుకుంటామని అన్నారు మండల పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్షు, అన్ని గ్రామాల సర్పంచులు,ఎం.పీ.టీ.సీ. సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

# విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు మహర్దశ

**అవసరానికి మించి డేటా సెంటర్లను ప్రోత్సహించొద్దు**
**ఐటీ, ఏఐ సంస్థలకు అధిక ప్రాధాన్యమివ్వాలి**
**2032నాటికి 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ**
**30 లక్షల ఉద్యోగాలే లక్ష్యం.. 7 గ్రోత్ డ్రైవర్స్, 10 పాలసీలతో ఆర్థిక ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు**
**వీఈఆర్‌పై సీఎం తొలి సమీక్ష.. 49 ప్రాజెక్టులపై చర్చ**




**నమస్తే హైదరాబాద్ :** విశాఖపట్నం, డిసెంబరు 12 విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్)ను సమగ్ర ప్రణాళికతో గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా చేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, పట్టణాభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతులు.. ఇలా అన్నివిధాలుగా ఈ ప్రాంతం అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. విశాఖను మురికివాడలు లేని నగరంగా తీర్చిదిద్దాలన్నారు. వివాదాల్లేకుండా వీఈఆర్ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ జరపాలని సూచించారు. 'విశాఖ ఎకనామిక్ రీజియన్' అభివృద్ధిపై ఆయన తొలిసారి విశాఖ రుషికొండలోని ఏ-1 గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం మంత్రులు, ఉన్నతాధికారులు, తొమ్మిది జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎకనామిక్ రీజియన్ సమగ్రాభివృద్ధి, రోడ్లు, రైలు మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్, ఇతర రంగాలకు సంబంధించిన 49ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మూడు ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటుచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. 2024నాటికి 52బిలియన్ డాలర్ల జీడీపీతో ఉన్న వీఈఆర్‌ను 2032కల్లా 125నుంచి 135బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రకటించారు. 7 గ్రోత్ డ్రైవర్లు, 10 విధానాలతో ఈ ఆర్థిక ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామని, దీంతో 30 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. వీఈఆర్ మాస్టర్ ప్లాన్‌ను సమర్థంగా అమలు చేస్తే 2047 నాటికి 750 నుంచి 800 బిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవచ్చన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్

మాస్టర్ ప్లాన్ ప్రకారం రానున్న 3నెలల్లో ఏం చేయాలనే దానిపై సీఎం దిశానిర్దేశం చేశారు. 'విశాఖలో అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. వీఈఆర్ పరిధిలో విస్తృతంగా ఉన్న వనరులు వినియోగించుకుంటే అద్భుతాలు సాధించవచ్చు. స్టీల్ సిటీ, పారిశ్రామిక సిటీ, ఫార్మా సిటీ, టూరిజం.. ఇలా అన్ని రంగాలనూ అభివృద్ధి చేసేందుకు వీలుంది. అనకాపల్లిలో త్వరలో మెడ్‌టెక్ జోన్-2ను ప్రారంభిస్తాం. టాయ్స్ పార్క్‌లో పరిశ్రమలు పెట్టేవారికి ప్రోత్సాహకాలు అందిస్తాం. రక్షణ తయారీ సంస్థలను ఆకర్షించాలి. ఏజెన్సీని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానించాలి. రహదారుల విస్తరణపైనా దృష్టి పెట్టాలి. ప్రతి 2నెలలకోసారి వీఈఆర్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తా' అని సీఎం వెల్లడించారు.

శాఖల వారీగా కార్యాచరణ విశాఖ ఆర్థికప్రాంతం కోసం వాణిజ్యం, పరిశ్రమలు, పురపాలక, పర్యాటకం, ఐఅండ్ఐ, ఆర్అండ్‌బీ, ఐటీఈ అండ్‌సీ, వ్యవసాయం, అటవీ, వైద్య ఆరోగ్యం, విద్య, నైపుణ్య శిక్షణ, విద్యుత్.. ఇలా శాఖల వారీగా విడివిడిగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. దీని పరిధిలో ప్రస్తుతం చేపట్టిన, నూతనంగా చేపట్టాల్సిన రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులపైనా ప్రణాళికలు సిద్ధం చేశారు. రైతులు సమష్టిగా ముందుకొస్తే ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుమతిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఆర్థిక రీజియన్‌లో ఏ ప్రాంతం ఏ పంటకు అనుకూలమో కలెక్టర్లు నివేదిక తయారుచేయాలని ఆదేశించారు. చెరువులు, రిజర్వాయర్లను నింపాలని, ఆక్వాకల్చర్ వృద్ధికి తీసుకోవలసిన చర్యలపై నివేదికను వచ్చే సమావేశానికి సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

ఉన్నతాధికారుల ప్రజెంటేషన్లు

సీఎం అధ్యక్షతన జరిగిన వీఈఆర్ తొలి సమీక్షలో వీఈఆర్ కన్వీనర్ ఎన్.యువరాజ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎంటీ కృష్ణబాబు, అజయజైన్, బి.రాజశేఖర్, ఆర్థిక, మున్సిపల్ పరిపాలన, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల ముఖ్య కార్యదర్శులు పీయూషకుమార్, సురేశ్‌కుమార్, చిరంజీవిచౌదరి తమ శాఖల పరిధిలో చేపట్టబోయే ప్రాజెక్టులు, ప్రణాళికల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేశ్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, సీఎస్ కె.విజయానంద్, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

9 జిల్లాలు.. 1.65 కోట్ల జనాభా
వీఈఆర్ విస్తీర్ణం 38 వేల చ.కి.మీ.
విశాఖ ఆర్థిక ప్రాంతం స్వరూపమిదీ..

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు ఉన్నాయి. 38 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఈ రీజియన్‌లో 1.65 కోట్ల మంది జనాభా ఉన్నారు. ప్రస్తుత జీడీపీ 52 బిలియన్ డాలర్లు. తలసరి ఆదాయం 3,170 డాలర్లు. పనిచేసేవారు సుమారు 70 లక్షల మంది ఉన్నారు.

ఈ ఎకనామిక్ రీజియన్ భౌగోళిక విస్తీర్ణం రాష్ట్రంలో 31% ఉండగా.. జనాభా 23%, జీడీపీ 30 శాతం.ఏడు గ్రోత్ సెంటర్ల ద్వారా ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, గ్లోబల్ పోర్ట్సు, నెక్ట్స్ జన్ రంగాల అభివృద్ధి, ప్లాన్డ్ అర్బనైజేషన్, హౌసింగ్, అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించాలన్నదే లక్ష్యం.ప్రస్తుతం ఆరు పోర్టులు ఉ ండగా.. కొత్తగా రెండు రానున్నాయి.

# తూర్పు తిరుమలేసుని బ్రమ్మోత్సవం



**నమస్తే హైదరాబాద్ :** స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సంవత్సర మార్గ సిర సుద్ద దశమి అనగా ఈ రోజు అధికారం సాయంత్రం చిత్తా నక్షత్రయుక్త మేస లగ్నమందు తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం లో వెలసి ఉన్న "శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి తృతీయ భ్రమ్మోత్సవాలు శ్రీ వైకానసాగమ రీత్యా శాస్త్రోక్తం గా నిర్వహిస్తున్నారు. 14వ తేదిన మొదలయ్యే ఈ బ్రమ్మోత్సవం 24వతేదిన ముగుస్తాయి. శ్రీ విశ్వక్షేనవాహనం లో సేనాధిపతిగా మొదటిరోజు శేషవాహనం పై శ్రీ పరావాసుదేవ స్వామిగా రెండవ రోజు, గరుడ వాహనం పై శ్రీ వేంకటేశ్వరస్వామి గా మూడవ రోజు, హనుమంత వాహనం పై శ్రీ రామ చంద్రమూర్తి స్వామిగా నాలుగవ రోజు, అశ్వవాహనం పై శ్రీ కల్కి స్వామిగా ఐదవ రోజు, కల్పవృక్ష వాహనం పై శ్రీ కృష్ణుని గా ఆరవ రోజు, హంస వాహనం పై శ్రీ సరస్వతి దేవిగా ఏడవ రోజు, గజవాహనం పై శ్రీ వెంకటా చలపతిగా ఎనిమిదివ రోజు సింహ వాహనం పై శ్రీ మాలయప్ప స్వామిగా తొమ్మిదవరోజు ఆలయ పుర వీదులలో స్వామి ఊరేగుతారు. కనులపండగలా జరిగే ఈ ఊరేగింపు లో స్వామి వారి రథంను భక్తులే స్వయంగా లాగి తన్మయం పొందుతారు. పదవ రోజు ముత్తయిదవలు నాదీ జల సంగ్రహణం చక్ర స్నానం, గోదా కళ్యాణం, రథోత్సవం, సంవత్సరోత్సవం తెప్పోత్సమం నిర్వహించి, చివరి రోజు పూర్ణహుతి నిర్వహించడం జరుగుతుంది. యోగ నిర్వహణ శ్రీ మాన్ వాడపల్లి గోపాలచార్యులు చే జరుపబడును. ముఖ్య అతిధి గా పెద్దాడ మిక్కిలి దుర్గయ్య శాస్త్రి పాల్గొంటారు. ఆలయ అర్చకులు పెద్దింటి రామ గోపాలకృష్ణ ఆచార్యులు,వేదాంతం పవన్ కుమార్ ఆచార్యులు పర్యవేక్షణ లో కార్యక్రమం జరుగును.ఈ కార్యక్రమంలలో డోలు సన్నాయి లక్ష్మి నరసాపురం సాయిరామ్ సన్నాయి మేళం వారిచే నిర్వహించబడును.ఈ బ్రమ్మోత్సవం జరిగే రోజులలో ఆలయం కి వచ్చే భక్తులకు అన్నీ సదుపాయాలు ఆలయ కమిటీ సమకూర్చింది. ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజనం సాయంత్రం అల్పాహారం ఆలయం వద్దే సమకూర్చి భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. కొన్ని వేలమంది పాల్గొనే ఈ కార్యక్రమం లో ఎక్కడా ఏ ఇబ్బంది రాకుండా కమిటీ ఏర్పాట్లు చెయ్యడం జరిగింది.

# నెల రోజులలో ఆ భూముల సమస్యకు పరిష్కారం

జరీబు భూముల సమస్యపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నెల రోజుల్లోగా జరీబు భూముల సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. జరీబు భూముల సమస్యలపై స్పందించారు. అలాగే పరీక్షలు నిర్వహించి నేల స్వభావం గురించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి వెల్లడించారు. లంక భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించామని వివరించారు. మరోవైపు అమరావతిలో భూ సమీకరణ చేపట్టని భూముల్లో ప్లాట్లు పొందిన రైతుల సమస్య పెండింగ్‌లో ఉందని కేంద్ర మంత్రి వెల్లడించారు. అక్కడి రైతులతో మాట్లాడిన తర్వాత భూసేకరణకు వెళ్తామని స్పష్టం చేశారు.వేరే చోట ప్లాట్లు కావాలని కోరిన వారికి లాటరీ ద్వారా కేటాయించేలా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు.



మరోవైపు అమరావతి భూ సమీకరణకు సంబంధించి 2004 మంది రైతులు భూములను భూ సమీకరణకు ఇవ్వలేదని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. వారితో మరోసారి మాట్లాడనున్నట్లు వెల్లడించారు. 26 గ్రామాల్లో డీపీఆర్ చేసి ఇస్తామన్న పెమ్మసాని చంద్రశేఖర్.. సోమవారం నుంచి బౌండరీ స్టోన్స్‌లను రెండు వైపులా వేయనున్నట్లు వెల్లడించారు. సోమవారం తరువాత గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి.. సోషల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ గురించి, గ్రామ అభివృద్ధి ప్రణాళికల గురించి చర్చించనున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.

మరోవైపు అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అమరావతిని మరింత విస్తరించాలని భావిస్తోంది. అందులో భాగంగానే రెండో విడత భూసమీకరణ చేపట్టాలని ఇటీవల నిర్ణయించింది. తొలి విడతలో రైతుల నుంచి 33 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ విధానం కింద సమీకరించిన ఏపీ ప్రభుత్వం.. రెండో విడతలో 16666 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించింది. మొత్తం ఏడు గ్రామాల పరిధిలో ఈ భూములను సమీకరించనున్నారు.


ఇందుకోసం రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం వంటి నిర్మాణాలను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం అదనంగా భూములను సమీకరించనున్నారు.పెదమద్దూరు, వడ్లమాను, ఎండ్రాయి, కర్లపూడి, వైకుంఠపురం, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాల పరిధిలో భూములను సమీకరించనున్నారు.

# కాంగ్రెస్ వరుస ఓటములపై రాహుల్, ఖర్గే లేఖ-సోనియాకు సూచనలు



కాంగ్రెస్ పార్టీ వరస వైఫల్యాలపై ఆవేదన వ్యక్తం చేసిన ఒడిశాకు చెందిన మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ మొక్విమ్ సోనియా గాంధీకి సంచలనమైన లేఖ రాశారు. ఆయన కాంగ్రెస్‌కి విస్తృతమైన సంస్కరణలు అవసరం అని స్పష్టం చేశారు. బారాబతి-కటక్ మాజీ ఎమ్మెల్యే డిసెంబర్ 8న ఐదు పేజీల లేఖలో లోక్‌సభ ఎన్నికల్లో వరుస ఓటములు, అలాగే 2024 నుంచి బీహార్, ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర, జమ్మూ-కాశ్మీర్, ఒడిశా రాష్ట్రాల్లో ఎదురైన పరాజయాలను ప్రస్తావించారు.మొక్విమ్ రాహుల్ గాంధీని మూడు సంవత్సరాలుగా కలిసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, అనుమతి లభించడం లేదని తెలిపారు. ఈ ఫిర్యాదు వ్యక్తిగతంగా కాకుండా, దేశవ్యాప్తంగా కార్యకర్తలు కూడా ఇలాగే భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పార్టీ యువత మరియు కార్యకర్తల మధ్య పెరుగుతున్న విభిన్నతపై మేల్కొచ్చే అవసరం ఉందని హెచ్చరించారు.లేఖలో, శశిథరూర్, డీకే శివకుమార్, సచిన్ పైలట్, ప్రియాంకా గాంధీ వంటి నేతలు భవిష్యత్తులో పార్టీ నాయకత్వానికి మద్దతుగా నిలవాలని సూచించారు. మల్లికార్జున ఖర్గే అధ్యక్షత్వంలో యువతతో వ్యక్తిగతంగా కలవలేకపోవడం వల్ల సమస్యలు తలెత్తాయని ఆయన అన్నారు. ఇప్పుడే కట్టుబడి చర్యలు తీసుకోకపోతే, వారసత్వంగా అందిన కాంగ్రెస్ పార్టీని కోల్పోవచ్చని హెచ్చరించారు.మొక్విమ్ జ్యోతిరాధిత్య సింధియా, హిమంత బిశ్వ సర్మ వంటి యువ నేతలను కాంగ్రెస్ కోల్పోయిన విషయం గమనించారు. సింధియా మధ్యప్రదేశ్‌లో పార్టీ మార్పుతో ప్రభుత్వాన్ని కూల్చేశారని, హిమంత ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ పట్టును పెంచి, కాంగ్రెస్‌కి తీవ్ర నష్టం కలిగించాడని ఆయన గుర్తు చేశారు. శతాబ్దాల వారసత్వం ఇలాగే కోల్పోబోతున్నప్పటికి, ఇతరుల చేతిలో ఓటమి కాకుండా, సొంత నిర్ణయాల వల్లనే పరిస్థితి తలెత్తిందని మొక్విమ్ హెచ్చరించారు.

# ఆ ప్రాంతం కొత్తగా ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ.. ఏకంగా 500 ఎకరాల్లో



**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టుల్ని తీసుకొచ్చే పనిలో ఉంది.. ఐటీ కంపెనీలు, పరిశ్రమలు మాత్రమే కాదు కేంద్రం సహకారంతో విద్యా సంస్థలు, యూనివర్శిటీలను ప్లాన్ చేస్తోంది. తాజాగా మరో సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది.. రాష్ట్రంలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు దిశగా కసరత్తు చేస్తున్నారు. మంత్రి నారా లోకేష్ ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సమయంలో ఈ ప్రతిపాదనపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆయన హస్తినలో జీఎంఆర్ సంస్థకు చెందిన ప్రతినిధులతో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ప్రతిపాదనలపై చర్చించారట.. కొన్ని ప్రణాళికులు సిద్ధం చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం పనులు ముగింపు దశకు వచ్చాయి. ఈ ఎయిర్‌పోర్ట్‌కు సమీపంగా ఉండే విశాఖపట్నం జిల్లా భీమిలి మండలంలోని అన్నవరం దగ్గర ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీకు భూములు అనువుగా ఉన్నాయని భావిస్తున్నారట. ఇక్కడ మాన్సాస్ ట్రస్ట్, ప్రభుత్వ, ప్రైవేట్ భూములు అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు. మొత్తం 500 ఎకరాల్లో ఈ సిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారట. ఈ ప్రాజెక్టులో జీఎంఆర్‌తో కలిసి అడుగులు వేయాలని భావిస్తున్నారట. ఈ నెలలో ఏవియేషన్ సిటీపై చర్చించి ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది అంటున్నారు. ఆ తర్వాత ఒప్పందం చేసుకుంటున్నారనే చర్చ జరుగుతోంది.ఈ ప్రాజెక్ట్ వస్తే విమానయానం, ఏరోస్పేస్, రక్షణ రంగాలలో విద్య, శిక్షణకు దేశంలోనే ఒక ప్రధాన కేంద్రంగా మారుతుంది. గతంలోనే కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఈ ప్రతిపాదనను తీసుకొచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పక్కన విమానయాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పుడు ఏవియేషన్ సిటీ దిశగా అడుగులు పడుతున్నాయి. ఎందుకంటే విశాఖపట్నం జిల్లా భీమిలి నుంచి భోగాపురం దగ్గరగా కూడా ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదన వాస్తవరూపం దాల్చితే ఇది విమానయాన రంగంలో ఒక విప్లవాత్మక మార్పును తీసుకువస్తుంది అంటున్నారు.ఈ ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీలో విమాన ఇంజిన్ల మరమ్మత్తు, నిర్వహణ, ఏరోస్పేస్ టెక్నాలజీ, రక్షణ పరికరాల తయారీ వంటి అనేక అంశాలపై శిక్షణ అందిస్తారు. ఈ ప్రాజెక్ట్ వల్ల స్థానికంగానే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న యువతకు నైపుణ్యాభివృద్ధి చెంది, మంచి ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జీఎంఆర్ సంస్థ నిర్వహిస్తున్న అకాడమీలు చిన్న స్థాయిలో ఉన్నప్పటికీ, ఈ కొత్త ప్రాజెక్ట్ ఆసియాలోనే అతిపెద్ద ఏవియేషన్ విద్యా కేంద్రంగా రికార్డు సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం చర్చల దశలోనే ఉంది.. అన్నీ కుదిరితే ఈ నెలలో ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ కనుక ఏర్పాటైతే విశాఖపట్నం, ముఖ్యంగా భీమిలి ప్రాంతం దశ తిరిగినట్లే అంటున్నారు.

# సీఎం చంద్రబాబుకు బిగ్ రిలీఫ్..

**నమస్తే హైదరాబాద్ :** వైసీపీ అధికారంలో ఉండగా ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందంటూ అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడుపైనమోదు చేసిన సీఐడీ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో ఆయనతోపాటు మిగిలిన నిందితులకు క్లీన్‌చిట్ ఇచ్చింది. 2014-19 నడుమ ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో నిబంధనలను ఉల్లంఘించి వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు టెండర్లను కట్టబెట్టారని, దానివల్ల కార్పొరేషన్‌కు రూ.114 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. నాటి ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి హరికృష్ణ, ఎండీ కె.సాంబశివరావు, టెర్రాసాఫ్ట్ డైరెక్టర్ తుమ్మల గోపాలకృష్ణ, చంద్రబాబు (ఏ-25), ముంబై, ఢిల్లీకి చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వాటి ఉన్నతాధికారులను నిందితుల జాబితాలో చేర్చారు.

# అధికారులు ప్రజలతో కలిసి సమస్యలు తెలుసుకోవాలి ఎమ్మెల్యే ప్రవీణ్





**నమస్తే హైదరాబాద్ :** ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు పర్యటన కార్యక్రమంలో భాగంగా బెల్లంకొండ మండలం నందిరాజుపాలెం సచివాలయ సిబ్బందితో సమావేశమైన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేలా పని చేయాలన్న ఎమ్మెల్యే.
కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అర్హులకు అందేలా పని చేయాలన్న ఎమ్మెల్యే.
గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలన్న ఎమ్మెల్యే.
గ్రామంలో డ్రైనేజీ కాలువల పూడికలు తీయడంతో పాటు రోడ్ల పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలన్న ఎమ్మెల్యే.
కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ వెన్నా సాంబశివ రెడ్డి , బెల్లంకొండ బీసీ సెల్ అధ్యక్షులు గుంజా గంగారావు, ఎమ్మార్వో , ఎండిఓ , మండల పార్టీ అధ్యక్షులు మరియు మండల అధికారులు పాల్గొన్నారు

# తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అందరం కలిసి మెలిసి పార్టీని బలోపేతం చేద్దాం ఎమ్మెల్యే ప్రవీణ్





**నమస్తే హైదరాబాద్ :** గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలంతా కలిసి మెలిసి వర్గ పోరు లేకుండా తెలుగుదేశం పార్టీని చంద్రబాబు నాయకత్వాన్ని బలోపేతం చేద్దామని పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ శనివారం అన్నారు పెదకూరపాడు నియోజకవర్గంలోని బెల్లంకొండ మండలంలోని నందిరాజుపాలెం గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించారు . ప్రజల వద్దకు ప్రవీణ్100 రోజులు100 గ్రామాలు పర్యటన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా నాయకులు కృషి చేయాలన్న ఎమ్మెల్యే. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ వెన్నా సాంబశివా రెడ్డి , బెల్లంకొండ బీసీ సెల్ అధ్యక్షులు గుంజ గంగారావు మండల పార్టీ అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న పలువురిని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించిన కంబాల

*49వేలు రూపాయలు ఆర్థిక సహాయం,175 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ..*





**నమస్తే హైదరాబాద్ :** గోకవరం మండలం పలు గ్రామాలలో పలువురిని పరామర్శించి, ఆపదలో ఉన్న వారికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు చేయూత అందించారు. తొలిత గోకవరం బంగాలిపేటలోని జక్కల చంద్రశేఖర్ (జేమ్స్ బాబు) పెద్ద కార్యం కార్యక్రమంలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి పదివేలు రూపాయలు, ఆర్థిక సహాయం, 25 కేజీలు బియ్యం పంపిణీ చేసారు. అనంతరం తంటికొండ గ్రామంలో ఇటీవలే మృతి చెందిన దళితుడు మాదే బుజ్జి బాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ఐదు వేలు ఆర్థిక సహాయం 25 కిలోల బియ్యం పంపిణీ చేసారు. అలాగే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బద్దిరెడ్డి రవి అన్నయ్య రాంబాబు ఇటీవలే మృతి చెందారు. రవిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన బిశెట్టి లక్ష్మాజీ తల్లి చంటి, పూడి నాని తండ్రి రాజు మృతి చెందారు. వారిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవలే మృతి చెందిన దళితుడు పల్ల బాబ్జి, నెల్లి రాఘవ కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం, 25 కిలో చొప్పున బియ్యాన్ని పంపిణీ చేసారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న సాయిదాల నాగేశ్వరరావు, పరామర్శించి 5,000 రూపాయలు నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న పల్ల భీమయ్య కు 3,000 రూపాయలు ఆర్థిక సహాయం చేసారు. అనంతరం ఇటికాయల పల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బందుల లక్ష్మికి 3,000 రూపాయలు, కండేపల్లి గోపాల కృష్ణ 3,000 రూపాయలు, ఆర్థిక సహాయం చేసారు. అలాగే అదే గ్రామానికి చెందిన కండేపల్లి అప్పన్న బాబుకి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి 25 కేజీల బియ్యం పంపిణీ చేసారు. అలాగే బోల్లేదు పాలెం గ్రామంలోని అనారోగ్యంతో మృతి చెందిన కడవల అప్పలరాజు భార్య అన్నవరం, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఐదు వేలు రూపాయలు ఆర్థిక సహాయం, 25 కిలోల బియ్యం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, పెద్దలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లపైకి ఎగబడ్డ ఏనుగులు



**నమస్తే హైదరాబాద్ :** సోమల, డిసెంబరు 13 సోమలవాసులను గజరాజులు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. పది రోజులుగా సోమల, ఇరికిపెంట పంచాయతీల్లోనే సంచరిస్తూ మధురమలై కొండనే ఆవాసం చేసుకున్నాయి. శుక్రవారం రాత్రి నెలుకూరివారిపల్లె సమీపంలో నాగన్న వరి కోతలు చేసి పంటను ఒబ్బిడి చేసి ఇంటి ఆవరణలోని బండపై బస్తాలో నిల్వ ఉంచగా ఏనుగులు తిన్నంతా తిని బస్తాలను తొక్కేశాయి. గురువారం రాత్రి నాగన్న పొలం వద్ద ధాన్యపు నిల్వలను ధ్వంసం చేసి మళ్లీ అక్కడికే రావడంతో మరోసారి పంటను కోల్పోయాడు. రాత్రి 7 గంటలకే అక్కడికి ఏనుగులు రావడం గుర్తించి కుటుంబ సభ్యులంతా ఇంటి మిద్దెపైకి వెళ్లారు. వారిపైకి దాడి చేయడానికి ప్రయత్నించాయి. ప్రాణ భయంతో అక్కడి నుంచే రైతులు టపాసులు పేల్చడంతో అక్కడి పైపులను, మోటరును ధ్వంసం చేసి మరో వైపు వెళ్లడం రైతులు గుర్తించారు.సోమలకు చెందిన పోలూరు చలపతి, శ్రీనివాసులు, నెలుకూరిపల్లెకు చెందిన నరసింహులు, మేకల గంగాధరం, గంగులప్ప పొలాల్లోని వరి, కొబ్బరి, మామిడి కొమ్మలను, బోరుపైపులను, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసి సాగులోకి తెచ్చుకున్న పంటలను రాత్రికి రాత్రే ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలం వద్దనే అడవిపందుల నుంచి పంటను రక్షించుకోవడానికి కాపుగాస్తున్న రైతులు ఏనుగుల సంచారం గుర్తించి గ్రామానికి చేరుకున్నారు. శనివారం సోమల సింగిల్ విండో అధ్యక్షుడు పీవీ శివశంకర్, సోమల టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహేంద్రకుమార్, చాణుక్య తదితరులు ఏనుగులు దాడులు చేసిన ప్రాంతాన్ని సందర్శించి బాధిత రైతులతో మాట్లాడారు. నష్టపరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# భూమి లేని పేదలకు నెలకు రూ.5 వేలు పింఛన్.... దరఖాస్తు చేసుకోండి

**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. అమరావతిలో భూమి లేని పేదలకు పింఛన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు సీఆర్డీఏ కసరత్తు జరుపుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సమావేశంలో అమరావతిలో భూమి లేని పేదలకు పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించారు. మొత్తం 4,929 మందికి పింఛన్ల పునరుద్ధరణపై త్రిసభ్య కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. వీరికి నెలకు 5 వేల రూపాయలు చొప్పున పింఛన్ ఇచ్చేందుకు సీఆర్డీఏ చర్యలు ప్రారంభించింది. మరోవైపు అమరావతి రాజధానికి భూసమీకరణ చేసిన సమయంలో.. భూమి లేని పేద ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పింఛన్ అందించాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే భూమి లేని 4,929 మంది పేదలకు పింఛన్లు అందించేవారు.

అయితే ఆ తర్వాతి కాలంలో రాజధాని పనులు నిలిచిపోయాయి. కొంతమంది పేదలకు పింఛన్లు కూడా రద్దయ్యాయి. అయితే టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి రావటంతో వీరికి పింఛన్లు పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఇందుకోసం సీఆర్డీఏ దరఖాస్తులు స్వీకరించనుంది. అర్హులైన వారు గ్రామాల్లోని సీఆర్డీఏ కార్యాలయాల్లో పింఛన్ల కోసం దరఖాస్తులు ఇవ్వాలని సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు ఓ ప్రకటనలో వెల్లడించారు. గ్రామసభల సమయంలోనూ పింఛన్ల కోసం అర్జీలు సమర్పించవచ్చని సూచించారు. అమరావతి పరిధిలోని భూమి లేని పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మరోవైపు అమరావతి రాజధాని కోసం గత టీడీపీ ప్రభుత్వం 33 వేల ఎకరాల భూమిని రైతుల నుంచి సమీకరించిన సంగతి తెలిసిందే. వారికి రిటర్నబుల్ ప్లాట్లతో పాటుగా కౌలు చెల్లింపులు చేస్తోంది. అయితే భూమి లేని పేదలకు కూడా పింఛన్లు అందించాలనే ఉద్దేశంతో 2015-16 మధ్యకాలంలో.. 29 గ్రామాల్లో 21,374 భూమి లేని కుటుంబాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం గుర్తించింది. వారికి నెలకు రూ. 2,500 చొప్పున పింఛన్లు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2024 ఫిబ్రవరిలో ఈ పింఛన్ మొత్తాన్ని పెంచారు. 2 వేల 500 రూపాయల నుంచి 5 వేల రూపాయలకు పెంచారు.

అయితే కరెంట్ బిల్లు సహా వివిధ సాంకేతిక కారణాలతో లబ్ధిదారుల సంఖ్యను కుదించారనే విమర్శలు ఉన్నాయి. అయితే 2024 ఎన్నికల్లో గెలిచి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత భూమి లేని పేదలకు ఇచ్చే పింఛన్ల కాలపరిమితిని మరో ఐదేళ్లు పెంచారు. రాజధాని గ్రామాల్లో అర్హులైన వారికి పింఛన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు చర్యలు చేపట్టారు.



# పోలవరం-నల్లమల సాగర్‌ను అడ్డుకోండి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును అడ్డుకోవాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ సమర్పించిన ఈ ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పరిశీలిస్తోందని, ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లకుండా సీడబ్ల్యూసీతో పాటు ఇతర కేంద్ర సంస్థలను నియంత్రించాలని కోరారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కేంద్ర జలశక్తి కార్యదర్శి వీఎల్ కాంతారావుకు లేఖ రాశారు. లేఖను రాష్ట్ర నీటి పారుదల కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం శ్రమశక్తి భవన్‌లో కాంతారావుతో పాటు సీడబ్ల్యూసీ చైర్మన్ అనుపమ్ ప్రసాద్‌కు అందజేశారు. ఏపీ ప్రభుత్వం పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టునే పోలవరం-నల్లమల సాగర్‌గా పేరు మార్చి డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచిందని తెలిపారు. వరద నీటిపై ఆధారపడిన ఈ ప్రాజెక్టు ప్రణాళికపై తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు రావాలంటే కృష్ణా ట్రైబ్యునల్-2 త్వరగా అవార్డును ఖరారు చేయాలని, అందుకోసం విచారణను వేగవంతం చేసేలా ఆదేశించాలని కోరారు. 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 90 టీఎంసీల నికర జలాలను కేటాయించి డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ అందించాం. ఇందులో పోలవరం ప్రాజెక్టుతో దక్కిన 45 టీఎంసీలపై ట్రైబ్యునల్‌లో విచారణ జరుగుతున్నందున మిగతా 45 టీఎంసీలతో ప్రాజెక్టు తొలిదశకు అనుమతులు ఇవ్వాల'ని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఆల్మట్టి డ్యాం ఎత్తుపై సుప్రీంకోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నందున కర్ణాటక చేపట్టదలిచిన భూ సేకరణను ఆపాలని మంత్రి ఉత్తమ్ కేంద్రాన్ని కోరారు. సీడబ్ల్యూసీ లేవనెత్తిన అభ్యంతరాలన్నీ నివృత్తి చేసినందున సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) డీపీఆర్‌కు అనుమతులు ఇప్పించాలన్నారు. ప్రాణహిత-చేవెళ్ల, మక్తల్-నారాయణపేట-కొడంగల్, సీతారామ, పాలమూరు-రంగారెడ్డి, ముక్తేశ్వర్ (చిన్ని కాళేశ్వరం) ఎత్తిపోతల పథకం, మొడికుంటవాగు, చనకా కొరాటాలో డిస్ట్రిబ్యూటరీలకు ప్రధానమంత్రి కృషి సింఛాయ్ యోజన కింద ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

# సినిమా



## చిరంజీవి, మోహన్‌బాబు అన్నదమ్ములుగా నటించిన సినిమా ఏదో తెలుసా?

టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవి, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు గురించి మాట్లాడితే ముందుగా గుర్తొచ్చేది వారి మధ్య నడిచిన కోల్డ్ వార్, బహిరంగ వివాదాలే. ఇద్దరూ 40 ఏళ్లకు పైగా సినీ పరిశ్రమలో కొనసాగుతూ, తమ తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నారు. వీరిద్దరి మధ్య స్నేహం ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో పోటీ తారాస్థాయికి చేరి, పరిశ్రమను కుదిపేసిన విషయం తెలిసిందే. వజ్రోత్సవాల సమయంలో వీరి మధ్య జరిగిన వాగ్వాదం.. ఆ తర్వాత 'మా' ఎన్నికల వరకు ఆ ప్రభావం కొనసాగింది. అయితే, ఈ ఇద్దరు దిగ్గజాలు ఒకప్పుడు చాలా సన్నిహితంగా ఉండేవారు. అంతేకాదు, కలిసి ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించారు కూడా! వాటిలో చాలా వరకు చిరంజీవి హీరోగా, మోహన్ బాబు విలన్‌గా నటించారు. కానీ, వీరు ఇద్దరూ కలిసి అన్నదమ్ములుగా నటించిన సినిమా ఒకటి ఉంది. ఆ అరుదైన చిత్రమేమిటో, దాని విశేషాలేంటో చూద్దాం.

'పట్నం వచ్చిన పతివ్రతలు'!

చిరంజీవి, మోహన్ బాబు కలిసి అన్నదమ్ములుగా నటించిన ఆ ఏకైక సినిమా 'పట్నం వచ్చిన పతివ్రతలు'. ఈ సినిమా 1982లో విడుదలైంది. ఇందులో మోహన్ బాబు అన్నగా, చిరంజీవి తమ్ముడిగా నటించి ప్రేక్షకులను మెప్పించారు. ఇది 'పట్టణక్కె బంద పత్నియరు' అనే కన్నడ సినిమాకు తెలుగు రీమేక్. మౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా పూర్తిగా కుటుంబ కథా చిత్రంగా, కామెడీ ప్రధానంగా సాగింది.

చిరంజీవి జోడీగా రాధిక, మోహన్ బాబు జోడీగా గీత నటించారు. ఈ సినిమా విడుదలైన తర్వాత బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇద్దరు అగ్ర నటుల కెరీర్‌కు ఈ చిత్రం మంచి బ్రేక్‌ను ఇచ్చింది. ఈ సినిమా తర్వాత వీరిద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయి. 80, 90వ దశకంలో చిరంజీవి వరుస విజయాలతో టాలీవుడ్‌లో నంబర్ వన్ హీరోగా ఎదిగారు. ఆయన దూకుడును ఆపడం ఎవరి వల్లా కాలేదు. సరిగ్గా అదే సమయంలో మోహన్ బాబు ఒకే ఒక్క సినిమాతో చిరంజీవికి గట్టి పోటీనిచ్చారు.

చిరంజీవి నటించిన 'బిగ్ బాస్' (1995) సినిమాతో పోటీగా మోహన్ బాబు నటించిన 'పెదరాయుడు' సినిమా విడుదలైంది. 'బిగ్ బాస్' ఫ్లాప్ టాక్ తెచ్చుకోగా, 'పెదరాయుడు' బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇది వీరిద్దరి కెరీర్‌లో ఉత్కంఠ రేపిన అతిపెద్ద పోరుగా మిగిలిపోయింది. ఏది ఏమైనా, ప్రస్తుతం ఇండస్ట్రీలో ఒకరికొకరు పోటీగా నిలిచే ఈ ఇద్దరు దిగ్గజాలు ఒకప్పుడు అన్నదమ్ములుగా కలిసి నటించిన 'పట్నం వచ్చిన పతివ్రతలు' సినిమా వారి పాత స్నేహ బంధానికి ఒక గుర్తుగా నిలిచింది.






## చలి చంపేస్తుందా..?

శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే చలి వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. ఫలితంగా జలుబు, దగ్గు, ఫ్లూ వంటి ఆరోగ్య సమస్యలు దాడి చేస్తాయి. కాబట్టి ఈ కింది పానీయాలు తీసుకోవడం ద్వారా మీ శరీరాన్ని ఈ కాలంలో వెచ్చగా ఉంచుకోవచ్చు. తద్వారా ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు. ఆ పానీయాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం..శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచే పానీయాలు ఇవే..

అల్లం %-% పసుపు టీ

అల్లం, పసుపు శరీరాన్ని లోపలి నుంచి వేడి చేసి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటితో తయారు చేసిన పానియం జలుబు, దగ్గును నివారించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఈ శీతాకాలంలో ఈ టీ తాగడం మంచిది.

పసుపు పాలు

పసుపు పాలు శరీరాన్ని వెచ్చగా ఉంచడమే కాకుండా, దగ్గు, జలుబు వంటి సమస్యలను దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది. జలుబు వల్ల కలిగే ఛాతీ నొప్పిని కూడా తగ్గిస్తుంది.జీలకర్ర నీరు

శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి జీలకర్ర నీటిని తాగవచ్చు. జీలకర్ర నీటిని తయారు చేయడానికి, ఒక టీస్పూన్ జీలకర్రను ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు ఆ నీటిని మరిగించి తాగితే సరి.

బెల్లం, జీలకర్ర నీరు

శీతాకాలంలో మీ శరీరాన్ని లోపలి నుంచి వెచ్చగా ఉంచడానికి, శరీర బలాన్ని కాపాడుకోవడానికి బెల్లం, జీలకర్ర నీరు తాగవచ్చు. బెల్లం, జీలకర్ర నీళ్లు శరీర జీవక్రియను పెంచుతుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

వేరుశెనగ సూప్

ఈ సూప్‌లో ప్రోటీన్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా, శక్తివంతంగా ఉంచడానికి సహాయపడుతుంది. ఇది ఎముకలు, కండరాలకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.




## తొక్కే కదా తీసి పారేస్తున్నారా.

చలికాలం వచ్చిందంటే ఎక్కడ చూసిన నారింజ పండ్లు కనిపిస్తాయి. వీటిని చాలా మంది ఇష్టంగా తింటారు. అయితే చాలా మంది పండును తిని, దాని తొక్కలను చెత్తబుట్టలో వేస్తారు. కానీ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నారింజ తొక్కలు పండు కంటే ఎక్కువ శక్తి, పోషకాలు, అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. ఈ తొక్కలలో విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, కాల్షియం వంటి ఆరోగ్యకరమైన సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. నారింజ తొక్కల ద్వారా లభించే 8 అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాం:

రోగనిరోధక శక్తికి బూస్ట్

నారింజ తొక్కలలో నారింజ పండు కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది శరీరంలో వైరస్‌లు, బ్యాక్టీరియాలకు వ్యతిరేకంగా రక్షణను పెంచుతుంది. ముఖ్యంగా చలికాలంలో తరచుగా వచ్చే జలుబు, ఇన్ఫెక్షన్లు, అలసటను నివారించడంలో నారింజ తొక్కలతో తయారు చేసిన టీ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.జీర్ణ సమస్యలకు పరిష్కారం

నారింజ తొక్కలు కడుపు నొప్పికి సహజ నివారణగా పనిచేస్తాయి. వీటిలోని ఫైబర్ కంటెంట్ గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం, ఉబ్బరం వంటి సమస్యల నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. ఇవి ప్రేగులను శుభ్రపరచి, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా జీర్ణక్రియ సజావుగా సాగుతుంది.

బరువు తగ్గడంలో సహాయం

మీరు బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నట్లయితే, నారింజ తొక్కలు మీకు సహాయపడతాయి. వీటిలోని ఫైబర్ జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఎండిన నారింజ తొక్కలతో చేసిన టీ లేదా పౌడర్ శరీరంలోని కొవ్వును కరిగించే ప్రక్రియను చురుకుగా చేస్తుంది. ఇది ఆకలిని నియంత్రించి, కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది.

గుండెకు రక్షణ

నారింజ తొక్కలో లభించే ఫ్లేవనాయిడ్లు శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి సహాయపడతాయి. అందువల్ల ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి, రక్త ప్రసరణను మెరుగుపరచడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో తోడ్పడతాయి.

మధుమేహ నియంత్రణ

నారింజ తొక్కలలోని ప్రత్యేక సమ్మేళనాలు గ్లూకోజ్ జీవక్రియను నియంత్రించడంలో సహాయపడతాయి. లైట్ టీ రూపంలో వీటిని తీసుకోవడం మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు. ఎందుకంటే ఇది చక్కెర పెరుగుదలను తగ్గిస్తుంది. సమతుల్య శక్తి స్థాయిలను నిర్వహించడానికి ఉపయోగపడుతుంది.

మెరిసే చర్మం కోసం

నారింజ తొక్కలలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉ ంటాయి. వీటిని ఇంట్లో ఎండబెట్టి పొడి చేసి ఫేస్ ప్యాక్‌గా ఉపయోగించినప్పుడు, ఇది చర్మంపై అదనపు నూనెను తొలగిస్తుంది. మొటిమలు, మచ్చలను తగ్గిస్తుంది. ఫలితంగా చర్మం సహజంగా ప్రకాశవంతంగా తాజాగా మారుతుంది.

బాడీ డిటాక్స్

## మెస్సీని కలవడానికా ? లేక బ్యాట్ పట్టడానికా?

భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీ సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ ముగిసిన తర్వాత కొద్ది రోజులు కుటుంబంతో గడపడానికి యునైటెడ్ కింగ్‌డమ్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే డిసెంబర్ 13న ఆయన తన భార్య, ప్రముఖ బాలీవుడ్ నటి అనుష్క శర్మతో కలిసి ముంబై ఎయిర్?పోర్టులో దర్శనమిచ్చారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో కోహ్లీ తిరిగొచ్చిన సమయంపై అనేక ఊహాగానాలు మొదలయ్యాయి.

మెస్సీని కలవడానికే వచ్చారా?

ప్రస్తుతం ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ 14 ఏళ్ల తర్వాత మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చారు. డిసెంబర్ 13 తెల్లవారుజామున 2 గంటలకు కోల్‌కతాకు చేరుకున్న మెస్సీ, సాల్ట్ లేక్ స్టేడియాన్ని సందర్శించారు. లక్షలాది మంది అభిమానుల మధ్య కేవలం 20 నిమిషాలు గడిపిన తర్వాత, ఆయన మధ్యాహ్నం కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. సరిగ్గా మెస్సీ భారత్‌లో ఉన్న సమయంలోనే కోహ్లీ ముంబైకి చేరుకోవడంతో ఆయన మెస్సీని కలవడానికే వచ్చారని అభిమానులు పెద్ద ఎత్తున ఊహించడం మొదలుపెట్టారు.

కోహ్లీ రాకకు అసలు కారణం ఇదే

అయితే, కోహ్లీ మెస్సీని కలవడానికి ముంబైకి రాలేదని తేలింది. త్వరలో జరగబోయే విజయ్ హజారే ట్రోఫీ 2025/26 కోసం సన్నాహాలు మొదలుపెట్టడానికే ఆయన భారత్‌కు తిరిగి వచ్చారు. ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ ధృవీకరించిన దాని ప్రకారం.. కోహ్లీ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఢిల్లీ జట్టు తరఫున కొన్ని విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లలో ఆడనున్నారు.

దేశవాళీ క్రికెట్ ఆడటం తప్పనిసరి

జాతీయ జట్టుకు ఆడనప్పుడు తప్పనిసరిగా దేశవాళీ మ్యాచ్‌లలో ఆడాలని బీసీసీఐ జాతీయ ఆటగాళ్లకు నిబంధన పెట్టింది. ఈ నిబంధన ప్రకారమే కోహ్లీ కూడా ఢిల్లీ తరఫున విజయ్ హజారే ట్రోఫీలో ఆడాల్సి ఉంది. ఈ దేశవాళీ మ్యాచ్‌లలో ఆడిన తర్వాతే ఆయన వచ్చే ఏడాది ఆరంభంలో జరగబోయే న్యూజిలాండ్ సిరీస్‌లో పాల్గొననున్నారు.

కోహ్లీ ఇటీవల సౌతాఫ్రికా సిరీస్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీతో కలిపి 100కు పైగా సగటుతో ఏకంగా 302 పరుగులు చేశాడు. అంతకుముందు ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో రెండు డక్‌లు చేసిన కోహ్లీపై సందేహాలు మొదలైనా, సౌతాఫ్రికా సిరీస్‌లో అదరగొట్టి 2027 వన్డే ప్రపంచకప్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు.



## తన బౌలింగ్ పై నిషేధం పడే అవకాశం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 మినీ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. ఈ వేలంలో మొత్తం 77 ఖాళీ స్లాట్‌లను భర్తీ చేయడానికి ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు పోటీపడనున్నాయి. షార్ట్‌లిస్ట్ అయిన ఆటగాళ్ల జాబితాలో భారత ఆల్‌రౌండర్ దీపక్ హుడా ఉన్నప్పటికీ వేలానికి సరిగ్గా ముందు అతనికి ఒక ఊహించని పరిణామం ఎదురైంది. సందేహాస్పద బౌలింగ్ యాక్షన్ ఉన్న ఆటగాళ్ల జాబితాలో దీపక్ హుడా పేరు ఇంకా కొనసాగుతోంది. ఈ విషయం ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ అతడిని ఏదైనా జట్టు కొనుగోలు చేసినా, ఐపీఎల్ 2026 సీజన్‌లో బౌలింగ్ చేయకుండా నిషేధం పడే అవకాశం ఉంది.

30 ఏళ్ల దీపక్ హుడా ప్రస్తుతం దేశవాళీ క్రికెట్‌లో రాజస్థాన్ తరఫున ఆడుతున్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లో లాగే, అతను ఇప్పటికీ బీసీసీఐ సందేహాస్పద బౌలింగ్ యాక్షన్ జాబితాలో ఉన్నాడు. ఈ నెల 16న జరిగే వేలానికి ముందు, దీపక్ హుడా బౌలింగ్ యాక్షన్‌కు సంబంధించిన ఈ ముఖ్యమైన సమాచారాన్ని బీసీసీఐ ఐపీఎల్ ఫ్రాంచైజీలకు తెలియజేసింది. హుడా పార్ట్-టైమ్ ఆఫ్-స్పిన్ బౌలింగ్ చేస్తాడు.

గత ఐపీఎల్ సీజన్‌లో దీపక్ హుడా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరఫున ఏడు మ్యాచ్‌లు ఆడాడు, అయితే ఆ మ్యాచ్‌లలో అతడు ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. అయినప్పటికీ, అప్పటి నుంచి అతను బీసీసీఐ దేశవాళీ టోర్నమెంట్‌లలో ఆరు ఓవర్లు బౌలింగ్ చేశాడు. హుడా చివరిసారిగా డిసెంబర్ 8న జార?ండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేశాడు. ఆ మ్యాచ్‌లో అతను 3 ఓవర్లు వేసి 24 పరుగులు ఇచ్చి 1 వికెట్ తీశాడు. మళ్లీ అతని బౌలింగ్ యాక్షన్ పై ఎవరైనా అనుమానం వ్యక్తం చేసి బీసీసీఐ ద్వారా పిలవబడితే, ఐపీఎల్‌లో బౌలింగ్ చేయకుండా అతనిపై నిషేధం విధించే అవకాశం ఉంది.



Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..